వార్త
ఆదివారం
14 ఆగస్టు, 2022



# పాడవోయి.. భారతీయుడా !

స్వాతంత్ర్య వజ్రోత్సవ ప్రత్యేకం

# రవితేజకి తల్లి పాత్రలో జయసుధ!



**నటిగా** జయసుధ ఇటీవల యాభై వసంతాలు పూర్తి చేసుకున్నారు. ఈ మధ్య కొంత గ్యాప్ తీసుకున్న జయసుధ, మళ్లీ చిరంజీవి సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. చిరంజీవి 154వ సినిమాగా 'వాల్తేర్ వీరయ్య' సినిమా రూపొందుతోంది. ఈ సినిమాకి బాబీ దర్శకత్వం వహిస్తున్నాడు.

ఈ సినిమాలో రవితేజ కీలకమైన పాత్రను పోషిస్తు న్నాడు. ఆయన తల్లి పాత్ర కూడా ఇందులో ముఖ్య మైంది. ఈ పాత్రకు జయసుధను తీసుకున్నట్ల తాజా సమాచారం.

మెగా స్టార్ సినిమా, మరో స్టార్ హీరోకి తల్లి పాత్ర కావడం వల్ల, ఆ పాత్ర తనకి నచ్చడం వల్ల జయసుధ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలో పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'అమ్మా నాన్న ఓ తమిళమ్మాయి' సినిమాలో ఆమె రవితేజ తల్లిగా చేసిన సంగతి విదితమే.

## తారాతీరం

# బోయపాటి దర్శకత్వంలో రామ్



**రామ్** నుంచి ఇటీవల 'ది వారియర్' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో రామ్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించాడు. తరువాతి సినిమాలో దోపిడీ దొంగగా కనిపించనున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి. దోపిడీ దొంగగా వైవిధ్యమైన లుక్‌తో కనిపిస్తాడని సమాచారం.

రామ్ హీరోగా బోయపాటి ఒక సినిమాను రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో రామ్ ద్విపాత్రాభినయం చేయనున్నాడనే విషయం చాలా రోజుల క్రితమే బయటికి వచ్చింది. ఈ చిత్ర కథ ఒక భారీ దోపిడీ నేపథ్యంలో నడుస్తుందని తెలుస్తోంది. ఇద్దరు రామ్‌లలో ఒకరు దొంగగా కనిపించనున్నారని టాక్. ఈ సినిమాలో కథానాయికగా రష్మిక పేరు వినిపిస్తోంది. మరో కథానాయికగా ప్రియాంక అరుళ్‌మోహన్ పేరును పరిశీలిస్తున్నట్టు టాక్. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగు మొదలు కానుంది. 'అఖండ' తరువాత బోయపాటి చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. రామ్ కెరియర్‌లో ఇది ఫస్టు ఇండియా మూవీ కావడం విశేషం.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
14 ఆగస్టు, 2022

## మంచి ముత్యాలు

ప్రేమ ఫలితంగా..వచ్చే బాధలన్నీ అన్ని ఆనందాలకన్నా తియ్యనైనవి.

- జాన్ డ్రైడెన్

## విషయ విశేషం


మనసు దోచే మొక్కలు..4

'సంఘీ'భావం....5

సమస్యల సుడిలో పాఠశాల విద్య

హింసా క్రీడల వినోద కేంద్రం కలోసియం..6

కవర్ స్టోరీ..8

పాడవోయి..

భారతీయుడా!

ఈవారం కవిత్వం..12

ఆశల మంచు దుప్పటి

వాంగో: పెయింటెడ్ విత్ వర్డ్స్..18

కథ.. 20

పరికర్మికా పరిక్రియ

సాహిత్యం..27

'మాకొద్దీ తెల్లదొరతనం'

'గరిమెళ్ల' స్వాతంత్ర్య పోరాట గీతిక

చిత్రభారతి.. .30

తెలుగు సినిమా రహదారి మారిందా?

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

కాసేపు సరదాగా నవ్వుకోండి

వగైరా..వగైరా..




# స్పెషల్ న్యూస్

## అక్షరాల మధ్య దూరం ఉండాలి..



అక్షరాల మధ్య దూరం ఎక్కువగా ఉంటే పిల్లలు దాన్ని త్వరగా చదవగలరని అంటున్నారు ఆంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ నిపుణులు. డిస్లెక్సియాతో బాధపడుతున్న పిల్లల్లో 13 శాతం, సాధారణ పిల్లల్లో 5 శాతం చదివే వేగం పెరిగినట్లు గుర్తించారు. ఇందుకోసం వీళ్లు కొందరు సాధారణ పిల్లల్నీ, మరికొందరు డిస్లెక్సియాతో బాధపడుతున్న పిల్లల్నీ ఎంపిక చేసి వాళ్లకి రెండు రకాల రాతప్రతుల్ని ఇచ్చి గట్టిగా చదవమని రికార్డు చేశారట. అప్పుడు డిస్లెక్సియా పిల్లలు చదివే వేగంలో తేడా స్పష్టంగా కనిపించింది. అంతేకాదు.. అక్షరాల మధ్య దూరం ఎక్కువగా లేని సాధారణ ప్రతి చదివినప్పుడు తప్పులు, కొన్ని పదాల్ని వదిలేయడం మొదలైనవి డిస్లెక్సియా ఉన్న చిన్నారుల్లో ఎక్కువగా కనిపించింది. అదే సాధారణ పిల్లల్లో ఈ వ్యత్యాసం ఎక్కువగా లేదు. మొత్తంమీద మామూలుగా కన్నా అక్షరాల మధ్య దూరం ఎక్కువగా ఉన్నప్పుడు రెండు వర్గాల పిల్లలూ వేగంగా తప్పుల్లేకుండా చదవగలిగారు.

## నిద్రటైమ్‌లో చీకటి మంచిది

లైటు, వెలుతురు ఎక్కువగా వుంటే ఎవరికీ సరిగ్గా నిద్ర పట్టదు. అయితే ఈ మధ్య బెడ్‌లైట్లూ ఆల్‌అవుట్లూ ఫోన్‌లతో అంతో ఇంతో కాంతి గది మొత్తం పరుచుకుంటూనే ఉంటుంది. అయితే కాస్తంత కాంతి కూడా లేని కటిక చీకటిలో పడుకుంటే మనిషికి ఆరోగ్యం అంటున్నారు పరిశోధకులు. నిద్ర పోయేటప్పుడు కొంచెం కాంతి వున్నా అది వాళ్లలో ఊబకాయం, మధుమేహం, బీపీ వంటి వ్యాధులకు దారి తీస్తుందంటున్నారు. ఎందుకంటే కాంతి ఎంత తక్కువ వున్నా దానికి శరీరం స్పందిస్తుందట. ఒక్క రాత్రి డిమ్ లైట్‌కి గురయినా కూడా గుండెవేగం, రక్తంలో గ్లూకోజ్ శాతం పెరుగుతుంది. పీనియల్ గ్రంథి రాత్రివేళలోనే మెలటోనిన్ హార్మోన్‌ను స్రవిస్తుంది. అందుకే దీన్ని 'హార్మోన్ ఆఫ్ డార్క్‌నెస్' అంటారు. అయితే రాత్రివేళలో కాంతికి గురయితే ఈ మెలటోనిన్ స్రావం తగ్గిపోతుంది. శరీరానికి ఎంతో మేలు చేసే ఈ హార్మోన్ శాతం తగ్గిపోవడంతో మధుమేహం, బీపీ వచ్చే అవకాశాలు ఎక్కువట. కనుక రాత్రివేళ గదిని ఎంత చీకటిగా చేసుకుంటే అంత మంచిది. లేకపోతే వృద్ధులు, పిల్లల్లో బీపీ, మధుమేహం వంటి సమస్యలు పెరుగుతున్నాయంటున్నారు నిపుణులు.








# మనసు దోచే మొక్కలు



మొక్కల్ని మనం ఎన్ని రకాలైనా పెంచుకోవచ్చు. ఆసక్తి, కాస్త శ్రద్ధ ఉండాలే కాని ఎలాంటి మొక్కలతోనైనా అందాన్ని రెట్టింపు చేసుకోవచ్చు. ఇందులో ఎడారి మొక్కలు ఒకటి. ఇవి మనల్ని ఇట్టే ఆకర్షిస్తాయి. సక్యులెంట్లను ఫ్లవర్ వేస్ ఆకారంలో వచ్చేలా పెంచేస్తున్నారు ఇప్పుడు. ఎంతో చిన్నగా ఉండే ఆ మొక్కల్ని అలా ఎలా పెంచేస్తారబ్బా అనే సందేహం కలగొచ్చు కానీ మనసుంటే వీటిని పెంచవచ్చు. కుండీలో ముందుగా ఎరుపు మట్టి వేసి దాని మధ్యలో మరో చిన్న కుండీనో, కప్పులాంటిదాన్నో పెడతారు. వాటి లోపలి నుంచి వచ్చేవిధంగా సక్యులెంట్లను ఓ పద్ధతి ప్రకారం నాటి..అక్కడక్కడా గులకరాళ్లు అమర్చితే ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.







'సంఘీ' భావం



# సమస్యల సుడిలో పాఠశాల విద్య

విద్యార్థి దశలో పాఠశాల విద్య అత్యంత కీలకపాత్ర పోషిస్తుంది. ప్రాథమిక విద్యలో పడిన పునాదిని క్రమపద్ధతిలో పెట్టి విద్యార్థుల కు ఉన్నత విద్యవైపునకు తీసుకువెళ్లడంతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకంగా పాఠశాలలు ఉంటాయి. దీనితో ప్రపంచవ్యాప్తంగా పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉంటుం ది. మన దేశంలో కూడా అనేక పథకాలు అమలులో ఉన్నాయి. దీనికి అనుగుణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పాఠశా ల విద్యకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయి. అయితే సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు విద్యార్థు లు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయుల సమస్య నుంచి సౌకర్యాల వరకు అనేక ఇబ్బందులు ఉంటున్నాయి. పాఠశాల విద్యలో సబ్జెక్ట్ టీచర్ల కొరత తీవ్రంగా ఉంటోంది. ప్రధానంగా సైన్స్, లెక్కలు బోధించే ఉపాధ్యాయులు కొరతగా ఉంది. దీనివల్ల ఆయా పాఠశా లల్లో చదివే విద్యార్థులు కొన్ని సబ్జెక్టులలో వెనుకబడి పోతున్నారు. ముందుగా పాఠశాలల పరిస్థితిని పరిశీలిస్తే అనేక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకుని ఉన్నాయి. సుమారు 60 శాతం పాఠశాలల్లో మరుగుదొడ్డి సౌకర్యం లేదు. దీనివల్ల విద్యార్థినిలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో విద్యార్థినిలు పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉండకపోవడంతో నీటిని తాగడానికి భయపడుతు న్నారు. శరీరానికి కావల్సిన నీరు అందకపోవడంతో అనేక రుగ్మతలు వారిని వెంటాడుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో కేవలం ఒకటి, రెండు మాత్రమే ఉంటున్నాయి. ఇంటర్వెల్ సమ యంలో అందరూ అక్కడికి చేరుకోవడంతో బారులు తీరి నిలబ డాల్సి వస్తోంది. కో ఎడ్యుకేషన్ పాఠశాలల్లో విద్యార్థినిలు ఇలా బాత్‌రూంలో బయట క్యూ కట్టడానికి ఇష్టపడటం లేదు. దీనితో స్కూలు ముగిసిన తరువాత ఇంటికి వెళ్లే వరకు వారు టాయిలెట్ కు వెళ్లకుండా ఉండాల్సి వస్తోంది. ఇక అనేక పాఠశాలల భవనాలు శిథిలం అయ్యాయి. వరుసగా వర్షాలు కురిస్తే ఎక్కడ కూలిపోతా యో అన్న భయం వెంటాడుతోంది. పాఠశాలలకు ఇవ్వవలసిన స్టేషనరీలో కోత విధించడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడు తున్నారు. ప్రస్తుతం రేషనలైజేషన్ పేరుతో అనేక పాఠశాలలను మూసివేసి సమీపంలోని పాఠశాలల్లో కలుపుతున్నారు. దీనివల్ల కొన్ని కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువులు మాన్పించి పనిలోకి పంపించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక పాఠశాలలు తెరిచిన తరువాత సకాలంలో పాఠ్యపుస్తకాలు అందడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాల పంపిణీ జరగలేదు. ముద్రణలో జాప్యం. రవాణా సక్రమంగా లేకపోవడం, గోదాముల నుంచి కొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సకాలంలో పుస్తకాలు తీసుకువెళ్లక పోవడం వంటి అనేక సమస్యలు విద్యార్థులకు శాపంగా మారుతు న్నాయి, పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో సకాలంలో సిలబస్ పూర్తి కావడం లేదు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు కిందటి సంవత్సరం పాఠ్యపుస్తకాలతో పాఠ్యాంశాల బోధన చేస్తున్నారు. దీనివల్ల ఇంటికివెళ్లిన తరువాత పిల్లలు పునశ్చరణ చేసుకోవడానికి వీలు లేకుండా పోతోంది. ఈ కారణంగా వారికి ఆయా సబ్జెక్ట్‌లపై పట్టు కోల్పోతున్నారు. పరీక్షల సమయంలో పూర్తిస్థాయిలో సమా ధానాలు రాయకపోవడం వల్ల మార్కులు తగ్గుతున్నాయి. దీనితో మానసిక ఆందోళనకు గురికావడంతో, ఇళ్లలో తల్లిదండ్రులు ఆగ్ర హం వ్యక్తం చేయడం తదితర అంశాలు వారిని విద్య పట్ల అనా సక్తిని పెంచుతున్నాయి. ప్రతి ఏటా విద్యార్థి సంఘాలు రోడ్డెక్కి ఉద్యమాలు చేస్తున్నారు. పాఠశాల విద్య అధికారుల కార్యాలయా లను, అసెంబ్లీ, ముఖ్యమంత్రి నివాసాలను ముట్టడించి తమ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎక్కడా అవి పరిష్కారానికి నోచుకోవడం లేదు. పాఠశాల విద్యకు ఖర్చు చేయాల్సిన నిధులను ఓట్ల కోసం నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లోకి డబ్బులు వేయడం వల్ల పాఠశాలల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతోంది. బాసర ఐఐటి విద్యార్థులు తమ సమ స్యలను పరిష్కరించాలని సుమారు నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ఇదే పరిస్థితి రెండు రాష్ట్రాల్లో ఉంది. పాఠశాల విద్యలో అన్నీ సమస్యలే కనిపి స్తుంటాయి. చివరకు విద్యార్థులకు ఆట స్థలాలు కూడా లేకుండా పోయాయి. కొన్ని పాఠశాలల్లో ఉన్నా కనీస నిర్వహణ లేకపోవ డంతో పనికి రాని చెట్లు పెరిగిపోవడం, వర్షాలకు మట్టి కొట్టుకు పోయి ఆడుకోవడానికి వీలులేకుండా తయారయ్యాయి. అనేక పాఠశాలల్లో పిఇటి పోస్టులు భర్తీ చేయడం లేదు. దీనితో సరైన సమయంలో విద్యార్థులకు వ్యాయామం, ఆటలు అన్నవి లేకుండా పోయాయి. ముందుగా పాఠశాలల వాతావరణం మార్చేందుకు ప్రయత్నించాలి. భవనాలు మరమ్మత్తులు చేసి, నిర్వహణ సక్రమం గా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. అనేక పాఠశాలల్లో అటెం డర్లు లేకపోవడంతో పాఠశాలను శుభ్రం చేసే పని విద్యార్థులపై పడుతోంది. చాలా పాఠశాలల్లో ప్రహరీ గోడలు లేవు. దీనితో రాత్రి వేళల్లో పాఠశాల ప్రాంగణాలు, గదులు అసాంఘీక చర్యలకు నిల యంగా మారుతున్నాయి. నిర్మాణ, నిర్వహణ బాధ్యతలు చక్కది ద్దాలి. ఆ తరువాత పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తికి తగిన విధం గా ఉపాధ్యాయులను నియమించాలి. పాఠ్యపుస్తకాలు సకాలంలో పంపించడం, స్టేషనరీలో కోత లేకుండా చూడటం వంటి వాటిపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపించాలి. అప్పుడే పాఠశాలలు ఆశించిన ఫలితాలను అందించి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం లభిస్తుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# హింసా క్రీడల వినోద కేంద్రం కలోసియం

**ఆధునిక** ప్రపంచ వింతల్లో ఒకటి ఇటలీ రాజధాని రోమ్ నగరంలోని కలోసియం. ఇది ఒక స్టేడియం ఆకారంలో ఉంటుంది. కలోసియంను మొదట ఫ్లావియన్ యాంఫీ థియేటర్‌గా గుర్తించారు. అందు వల్ల దీనిని యాంఫీ థియేటర్స్ అని కూడా పిలుస్తారు. దీన్నే గ్లాడియేటర్ ప్యాలెస్ అని మరో పేరు. కలోసియంను సింబల్ ఆఫ్ ది పవర్, మెజిస్టీ ఆఫ్ ది ఎంపరర్ అనే పేర్లతో కూడా పిలుస్తుంటారు. కలోసియంను దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితం నిర్మించారు. దీన్ని 156 మీటర్ల వెడల్పు, 189 మీటర్ల పొడవు, 57 మీటర్ల ఎత్తు, నాలుగు అంతస్తులతో దాదాపు 50 వేల మంది ప్రేక్షకులకు పైగా కూర్చునేలా నిర్మించారు. ఇది రోమన్ సామ్రాజ్యాధినేతలచే నిర్మితమైన అతి పెద్ద ప్రేక్షకాగారం. అద్భుతమైన ఈ నిర్మాణం పాత రోమ్‌లో షియాజా వెనిజియా తరువాత ఫోరీ ఇంపీరియేల్ గుండా ప్రయాణిస్తున్నప్పుడు గంభీరంగా కనిపిస్తుంది. రోమన్ సామ్రాజ్యాధీశులు దీన్ని నిర్మించారు. కలోసియం స్టేడియం నిర్మాణాన్ని రోమ్ చక్రవర్తి వెస్పాసియన్ క్రీ.శ.70లో పునాదిరాయి వేసి ప్రారంభించినప్పటికీ ఆయన కాలంలో పూర్తి కాలేదు. రెండు సంవత్సరాల కాలంలో కొంత భాగం పూర్తయింది. మరో 8 సంవత్సరాల తరువాత వెస్పాసియన్ చక్రవర్తి వారసుడైన టైటస్ చక్రవర్తి కాలంలో ఈ నిర్మాణం అనేక మార్పులతో పూర్తి చేసి ప్రారంభించారు. డొమిటియన్ చక్రవర్తి ఈ నిర్మాణానికి కొన్ని మార్పులు చేశారు. కలోసియం నిర్మాణం క్రీ.శ.80లో పూర్తి చేశారు. దీని నిర్మాణానికి 60 వేల మంది బానిసలతో దాదాపు పదేళ్లపాటు వెట్టిచాకిరీ చేయించారు. కేవలం మతం ఆధీనంగా ప్రజలను బానిసలుగా చేసి నిర్మించిన మొదటి కట్టడంగా కలోసియం అపఖ్యాతిపాలైంది. ఈ కట్టడమంతా రాళ్లు, కాంక్రీట్‌తో నిర్మించారు. దీనికి మొత్తం 80 ప్రవేశ ద్వారాలుంటాయి.

షేక్ అబ్దుల్ హాకీం జాని

## క్రూర వినోదానికి కేంద్రం

తమ ప్రజలకు వినోద కార్యక్రమాలు అందించాలనే నేపథ్యంలో దీన్ని అప్పటి రోమ్ చక్రవర్తులు నిర్మించారు. తమ బానిసలతో పాటు జంతువుల మధ్య, మనుషుల మధ్య, జంతువులు-మనుషుల మధ్య పోరాటాలు పెట్టి ఇక్కడ ప్రజల సమక్షంలో ప్రదర్శించడం వల్ల క్రూర, రక్తపాత వినోద కేంద్రంగా కలోసియం మరోసారి అపఖ్యాతిపాలైంది. ఒకసారి వరదలు వచ్చి కలోసియం అడుగు భాగమంతా నీటితో నిండిపోయింది. ఆ సమయంలో కూడా రోమ్ చక్రవర్తులు పడవ యుద్ధాలు జరిపారట. ఆ యుద్ధాలలో అనేకమంది వీరులు, సింహాల వంటి జంతువులు ప్రాణాలు కోల్పోయాయి. అలా ప్రాణాలు కోల్పోయినవారు దాదాపు అయిదు లక్షల మంది ఉంటారని అంచనా.


ఇటలీ రాజధాని రోమ్ నగరంలోని కలోసియం పేరు చెబితే అందరికీ గుర్తుకు వచ్చేది ఒళ్లు గగుర్పొడిచే యుద్ధ విన్యాసాలు. ఆ రోజుల్లో కలోసియంలో హింసాత్మక వినోద ప్రదర్శనలు జరుగుతుంటే ప్రజలు కేరింతలు కొడుతూ, అమితోత్సాహంతో చూసేవారు. అతిబలమైన క్రూరజంతువులను కొందరు యోధులు బరిసెలతో వేటాడి చంపడం అప్పట్లో ఒక క్రీడా వినోదంగా భావించే వారు. ఇక్కడ మరో ప్రధాన ఆకర్షణ గ్లాడియేటర్స్. ఈ పేరుతో పిలవబడే ఇద్దరు యోధుల నడుమ ఎవరో ఒకరు చనిపోయేంత వరకు భీకర పోరు సాగుతుంది. గ్లాడియేటర్స్‌గా పిలిచే ప్రాచీన యుద్ధవీరుల పోరాటాలతో అలనాటి రాజ కుటుంబాలు వినోదం పొందేవి. ప్రేక్షకుల కోలాహలంతో కలోసియం కిక్కిరిపోయేదని అక్కడి ప్రజలు చెప్పుకుంటారు. ఇటువంటి పోరాటం వల్ల లెక్కలేనన్ని జంతువులు, యోధులు నేలకొరిగారు.






**సొరంగ మార్గాలు**

కలోసియంలో ప్రేక్షకులు కూర్చునే ప్రదేశం అడుగు భాగంలో 15 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో భూగర్భ సొరంగాలు, కొన్ని గదులను నిర్మించారు. యుద్ధ కళల్లో సుశిక్షితులైన గ్లాడియేటర్స్ పోరాటానికి ముందు వీటిలోనే వేచి ఉండేవారు. సొరంగం తలుపులు తీయగానే వారు కలోసియం మధ్య వున్న యుద్ధభూమిలోకి ప్రవేశించేవారు. సాధారణంగా ఈ సొరంగాల్లో వెలుతురు తక్కువగా ఉండటంతో కొవ్వొత్తులను ఉపయోగించాల్సి వచ్చేది. అయితే కలోసియంలో చాలా భాగం ధ్వంసమవడంతో సొరంగాల్లో కొంతమేర స్పష్టంగా కనిపిస్తుంది. కలోసియం మొత్తానికి భూ అంతర్భాగంలో ఉన్న ఈ నిర్మాణాలనే కీలకంగా భావిస్తారు. అందుకే ఇటలీ ప్రభుత్వం వీటిని వందల ఏళ్లుగా పరిరక్షించుకుంటూ వస్తోంది. ఈ కలోసియం అడుగు భాగాన సొరంగ మార్గాలు ఉంటాయి. ఈ సొరంగ మార్గాల ద్వారా జంతువులను మైదానంలోకి ప్రవేశపెడతారు. పోరాట యోధులకు కావలసిన ఆయుధాలు, జంతువులు ఈ సొరంగాలలో ఉంటాయి. కలోసియం నిర్మాణంలో పాల్గొన్న బానిసలను కూడా ఇక్కడ జరిగే పోరాటాలలో బలవంతంగా పాల్గొనేలా చేసేవారు. అలా అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. రక్తపాతంతో కూడిన ఇంతటి క్రూరత్వాన్ని వినోదంగా భావిస్తూ అప్పటి చక్రవర్తులు, ప్రజలు కేరింతలు కొడుతూ ఆస్వాదించేవారు. హింసాత్మకమైన ఈ క్రీడల్ని తిలకించ డానికి విచ్చేసే ప్రజల వద్ద ఎటువంటి డబ్బు వసూలు చేసేవారు కాదు. ఇటువంటి క్రూర క్రీడలు అనేకమంది చక్రవర్తి వారసులు దాదాపు 350 ఏళ్ల వరకు కొనసాగించారు. రోమ్ చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన కలోసియంలో కొద్ది భాగాన్ని మాత్రమే చూసేందుకు సందర్శకులకు అనుమతి ఉంటుంది. అందులోని భూగర్భ సొరంగాలను చూసేందుకు అనుమతి ఉండేది కాదు. అయితే కలోసియం చరిత్రలో తొలిసారిగా ఆ సొరంగాలను చూసేందుకు ప్రస్తుతం అనుమతి ఇస్తున్నారు. ప్రస్తుతం మూడు దశల్లో చేపట్టిన కలోసియం సొరగాల పునర్నిర్మాణ పనులు ఎనిమిదేళ్లుగా జరుగుతున్నాయి. 80 మంది పురావస్తు శాస్త్ర నిపుణులు, ఇంజినీర్లు కలిసి ఈ పని పూర్తి చేశారు. తాజాగా సందర్శకులను వాటిని చూడటానికి అనుమతిస్తున్నారు. రోమ్ నగరానికి వచ్చినవారు విధిగా కలోసియంను తిలకిస్తారు. ప్రపంచ



వ్యాప్తంగా ప్రజలు వేసిన ఓట్ల ఆధారంగా జులై 2007లో కలోసియంను ఆధునిక ప్రపంచపు ఏడు వింతల్లో ఒకటిగా గుర్తింపు ఇచ్చారు. 1980లో దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది. నేడు రోమన్ కలోసియం రోమ్ నగరంలో అతిపెద్ద పర్యాటక ఆకర్షణలలో ఒకటిగా భాసిల్లుతోంది. భూకంపాల వల్ల కలోసియం నిర్మాణం కొంత భాగం దెబ్బతిన్నది. 20వ శతాబ్దం నాటి వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు, నిర్లక్ష్యం, విధ్వంసాల కలయికల కారణంగా కలోసియం



నిర్మాణం మూడింట రెండు వంతుల నాశనమైంది. పునరుద్ధరణ ప్రయత్నాలు 1990లో ప్రారంభమయ్యాయి. కలోసియం ప్రపంచం నలుమూలల నుండి వచ్చే పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా కొనసాగుతున్నందున అనునిత్యం ప్రపంచ వ్యాప్తంగా ఇక్కడకు సందర్శకులు తండోపతండాలుగా వస్తూ వుంటారు. కలోసియంను ప్రతి ఏడాది 7.5 మిలియన్ల పర్యాటకులు సందర్శిస్తారని అంచనా. కలోసియం ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు తెరుచుకుంటుంది. ఈ నిర్మాణాన్ని తిలకించాలంటే గైడ్‌లు అందుబాటులో ఉంటారు. కరోనా సమయంలో పర్యాటక రంగం కుదేలయ్యింది. ముఖ్యంగా తమ దేశంలో యువతకు ఉద్యోగాలు రావాలంటే టూరిజం ప్రధానమని ఇటలీ ప్రభుత్వం గుర్తించింది. కరోనా సమయంలో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి ఈ గ్లాడియేటర్ ప్యాలెస్‌ను పునఃనిర్మించి పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షించి ఆదాయం పెంచుకో వాలని రోమ్ ప్రభుత్వం భావించింది. 19వ శతాబ్దంలో కూలిన భాగాన్ని సైతం మరమ్మత్తులు చేయాలని నిర్ణయించారు. దాదాపు 18.5 మిలియన్‌ల యూరోన్‌లతో దీని పునః నిర్మాణ కార్యక్రమం చేపట్టి 2023 నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నారు. ❏



# పాడవోయి.. భారతీయుడా!

> ఏ పూర్వ పుణ్యమో ఏ యోగ బలమొ
> జనియించినాడనీ భరతఖండంబున
> లేదురా ఇటువంటి భూదేవి యెందు
> లేరురా మనవంటి పౌరులింకెందు

కవర్‌స్టోరీ

**ఎ.వి.వి ప్రసాద్**
**అసోసియేట్ ఎడిటర్**


**మహాకవి** రాయప్రోలు మాటల్లో భారత్ వెలుగులు తలపోసుకుంటే ఆ స్మృతులే ఒక మధురం. ఆ భావనలే సుమధురం. భరతజాతి నిండుగౌరవాన్ని ఆనాడు, ఈనాడు మన కవులు ఎంతో మధురాతి మధురంగా కీర్తిస్తూనే ఉన్నారు. అటువంటి భరతభూమి దాస్యశృంఖలాల నుంచి విముక్తి పొంది ఇప్పటికి 75 వసంతాలు గడిచాయంటే అది ఎంతో సుదీర్ఘ ప్రయాణం. ఎన్నో ఆటుపోట్లు.. ఎన్నో శిఖరాలు. ఎన్నో విజయాలు.. కొన్ని ఎదురుదెబ్బలు.. అన్నిటినీ తట్టుకొని, పొదివిపట్టుకొని 140 కోట్లు పైగా ఉన్న తన సంతతిని, వారి సంక్షేమాన్ని తనతో నడిపిస్తూ ముందుకు కదులుతోంది భరతమాత. 'ఆజాదీ కా అమృత్ మహోత్స్'వాన్ని జాతి జనులందరు ఎంతో సంతోషంతో సంబరాలు జరుపుకొంటున్నారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏడున్నర దశాబ్దాలు.. వెనక్కి తిరిగిచూస్తే ఎన్నో పంచవర్ష ప్రణాళికలు, వాటి కుదుళ్ల నుంచి పెరిగిన అభివృద్ధి ధగధగలాడుతూ మనకు కనిపిస్తాయి. పార్టీలు, ప్రభుత్వాలు మారుతూనే ఉంటాయి. కానీ అవి చేసిన కృషి, దేశ అభివృద్ధికి పాటుపడిన శ్రమే కలకాలం నిలిచి వెలుగుతుంది. ఆ కోణం నుంచి చూస్తే భారత్ గడచిన ఏడున్నర దశాబ్దాలలో సాధించిన అభివృద్ధి తక్కువేమీ కాదు. కొన్ని రంగాలలో ఇంకా తగినంత అభివృద్ధి జరగలేదనేవారు ఉండవచ్చు. కాదనలేం. కానీ జరిగిన అభివృద్ధిని కూడా తక్కువ చేయలేం. సాధించినదానితో సంతృప్తిని చెంది కూర్చుంటే సాధించవలసింది ఎంతో మిగిలిపోతుంది. అందుకే నిరంతరం ఆ కృషిని కొనసాగిస్తున్నాం. కొనసాగిస్తూనే ఉంటాం.

రాజకీయంగా దార్శనికత కలిగిన ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి శాతం కొంత ఎక్కువ ఉండవచ్చు. కొన్ని ప్రభుత్వాల హయాంలో కొంత మందగించవచ్చు. గత ఏడున్నర దశాబ్దాలలో ఆ రెంటింటినీ మనం చూశాం. మొత్తం మీద చూస్తే సాధించిన అభివృద్ధే గణనీయంగా కనిపిస్తుంది. ఈ రోజున ప్రపంచంలోని అగ్రరాజ్యాలుగా పిలుస్తున్న దేశాల సరసన భారత్ కూర్చోగలిగిన పరిస్థితికి వచ్చిందంటే దాని వెనుక జరిగిన కృషి సాధారణమైనదేమీ కాదు. ఎంతో ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయడం జరిగింది.

ఎంతో కష్టపడి సాధించిన స్వాతంత్ర్యాన్ని దేశ ప్రజలందరు అనుభవించే విధంగా ప్రపంచంలోనే అతిగొప్ప రాజ్యాంగం మనకు ఉంది. ఆ రాజ్యాంగం అందించిన ఫలాలను దేశ ప్రజలందరు అనుభవిస్తూనే ఉన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమేది? అనే ప్రశ్నకు ప్రపంచ ప్రజలంతా ఇచ్చే సమాధానం భారత్ అని. ఆ ఖ్యాతి నుంచి వివిధ రంగాలలో సాధించిన, సాధిస్తున్న అభివృద్ధితో మరెన్నో అంశాలలో కూడా భారత్ పేరు వినిపించే దశకు చేరుకుంది. ప్రపంచ దేశాలు ఏ ముఖ్య విషయం గురించి చర్చించేందుకు కూర్చున్నా అటు అమెరికా పక్కనో, ఇటు బ్రిటన్ పక్కనో భారత్ కూర్చోవలసిందే.

ప్రపంచం ఎటువంటి సంక్షోభాలను ఎదుర్కొన్నా, వాటి పరిష్కారంలో భారత్ పాత్ర ఉండవలసిందే. అణ్వస్త్ర వ్యాప్తిని నిరోధించడానికైనా, కాలుష్యరహిత ప్రపంచాన్ని నిర్మించడానికైనా ఎంత గొప్ప దేశమైనా సరే.. భారత్‌తో చేయి కలపవలసిందే. భారత్ పాల్గొనని ఏ సమావేశమైనా సంపూర్ణం కాదనే తీర్మానానికి ప్రపంచ దేశాలన్నీ వస్తున్నాయంటే అది మన ప్రజాస్వామిక వ్యవస్థ వల్లనే. తలసరి ఆదాయం గణనీయంగా పెరిగి, దారిద్ర్య రేఖకు దిగువన గల ప్రజల శాతం క్రమంగా తగ్గుతున్నదంటే అది మనం అనుసరిస్తున్న ప్రజాస్వామిక విధానాల వల్లనే. పారిశ్రామికంగా, వ్యావసాయకంగా, విద్యా విషయంగా ఎన్నో రెట్లు అభివృద్ధిని సాధించిన భారత్ వైపు ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ చూస్తున్నాయంటే అది మనం సాధించిన గణనీయమైన అభివృద్ధి వల్లనే. ఏం సాధించాలి? అని పెదవి విరిచేవారు ఎప్పుడూ ఉంటారు. సాధించింది గుర్తుంచేవారూ ఉంటారు. సాధించవలసినదాని కోసం కృషి చేసేవారూ ఉంటారు. అభివృద్ధి అనేది కొత్త చిగురు లాంటిది. ఒకదాని తర్వాత ఒకటి చిగురిస్తూనే ఉంటుంది.

భారత్ ప్రధానంగా వ్యావసాయక దేశం గనుక తొలుత అందరి దృష్టి ఈ రంగం పైనే పడుతుంది. ప్రపంచానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా భారత్ మొదటి నుంచి పేరు పడింది. గత ఏడున్నర దశాబ్దాలలో మన వ్యావసాయక ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి కూడా. సంప్రదాయ విధానాలతో పాటు ఆధునిక సాంకేతిక సౌకర్యాలను కూడా ఉపయోగించుకొంటూ వ్యవసాయ రంగం ఎన్నో రెట్లు అభివృద్ధిని సాధించింది. మన వ్యావసాయక ఉత్పత్తులంటే ప్రపంచంలో 2014 లెక్కల ప్రకారం 4771 బిలియన్ డాలర్లు ఉంటే, దానితో దాదాపు సగ భాగం కేవలం ఆరు దేశాల నుంచి ఉత్పత్తవుతోంది. వాటిలో చైనా (1,005 బిలియన్ డాలర్లు) తర్వాత నిలబడుతున్న దేశం భారత్ (367 బిలియన్ డాలర్లు). భారత్ తర్వాతే అమెరికా ఉంది. ప్రపంచంలో వ్యావసాయకంగా చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం కూడా మనదే. 20-21 భారత ఆర్థిక సర్వే ప్రకారం నేటికీ దేశ జనాభాలో 54.6 శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. అందుకే జాతీయ






ఆదాయంలో 18.8 శాతం ఈ రంగం నుంచే లభిస్తున్నట్లు చెబుతున్నాయి. మొదటి పంచవర్ష ప్రణాళిక నుంచే వ్యవసాయ రంగానికి, అనుబంధ రంగాలకు ఎంతో ప్రాధాన్యమిస్తూ వచ్చారు. వ్యవసాయ ఆధారిత రంగాలు కూడా అదనంగా పెరగడంతో ఈ రంగానికి మరింత ప్రాధాన్యం పెరిగింది. దేశంలో సాధించిన పారిశ్రామిక విప్లవం వల్ల సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది హరిత విప్లవానికి దారి తీసింది. మనం సాధించిన హరిత విప్లవం ప్రపంచానికే ఆదర్శమని ఎందరో మేధావులు కొనియాడారు కూడా. వ్యవసాయంలో ఉత్పాదకతను



పెంచడానికి జరుగుతున్న పరిశోధనలు, కృషి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సంప్రదాయ సేంద్రియ సేద్యం, ప్రకృతి వ్యవసాయంపై ఇప్పుడు మక్కువ పెరిగి మరెన్నో వినూత్న పద్ధతుల ద్వారా సాగును మెరుగుపరిచే ప్రక్రియలు సాగుతున్నాయి. తగిన మద్దతు ధర లభించడంలేదనో, రుణాల మంజూరు సక్రమంగా లేదనో విమర్శలు కొన్ని ఉన్నా, మొత్తంమీద భారత్ ఆత్మగా వ్యవసాయ రంగం పురోగతి సాధిస్తోంది. 75 సంవత్సరాల స్వాతంత్ర్యం సాధించిన మధుర ఫలాలలో ఇది ఒకటి.

## మానవ వనరుల సద్వినియోగం

మానవ వనరుల సంపదలో ఇప్పుడు భారత్ 'నం-1' స్థానానికి చేరుతుండడం ఒకింత గర్వకారణమే. ఎందుకంటే మానవ వనరుల్లో సుసంపన్నమైతే, మిగిలిన రంగాలు బలోపేతం కావడం తేలికవుతుంది గనుక. 'దేశమంటే మనుషులోయ్' అన్నది అందుకే. వచ్చే యేడాదికల్లా ప్రపంచ జనాభాలో మన దేశమే నంబర్ వన్ అవుతుందని ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం (యుఎన్‌పిడి) అంచనా వేసింది. ఇప్పటిదాకా చైనా తర్వాత స్థానంలో భారత్ ఉంది. వచ్చే యేడాదికి జనసంఖ్యలో చైనాను అధిగమించి ప్రపంచంలో భారత్ అగ్ర స్థానానికి చేరుతుందని అంచనా. చైనా జనాభా ప్రస్తుతం 142.6 కోట్లు కాగా, మన దేశ జనాభా కొంచెం తక్కువగా 141.2 కోట్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. నిజానికి 2027 నాటికి జనాభాలో మనం చైనాను మనం చైనాను దాటవచ్చని గతంలో అంచనా వేశారు. అయితే దానికి ఓ నాలుగేళ్ల ముందే ఆ సంఖ్య దాటవచ్చని తాజా అంచనా. ఒకటే బిడ్డ విధానం నుంచి ప్రస్తుతం మూడో బిడ్డ వరకు చైనా అనుమతిస్తోంది. పని చేసే చేతులు ఎరిగితే ఉత్పాదకత పెరగడానికి కూడా అవకాశం ఉంటుందనే సిద్ధాంతాన్ని చైనా అమలు చేసిన తర్వాత నుంచి అక్కడ కూడా చాలా మార్పు వచ్చింది. మన దేశంలో జనాభా నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకొంటున్నా, సంఖ్య మరింతగా పెరగడం కొంత ఆందోళన కలిగించినా ఆ విషయంలో నంబర్ వన్‌కు చేరడం హర్షదాయకమే అని చెప్పాలి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్య, వైద్య వసతులు పెంచడానికి ప్రభుత్వాలు మరిన్ని గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జనసంఖ్య పెరగడం ఒక విధంగా మంచిదే అయినా, వారికి నాణ్యమైన, మెరుగైన జీవనాన్ని ప్రభుత్వాలు అందించగలిగితేనే తగిన ప్రయోజనం లభిస్తుంది. 20-60 మధ్య వయసుగల జనాభా నుంచి సమాజానికి ఎక్కువ ప్రయోజనం లభించేలా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించి అమలు చేయగలిగితే ఆ జనాభా దేశానికి వరప్రసాదమే అవుతుంది. జనాభాను ఉపయోగించుకోలేని ప్రభుత్వాలు ఉంటే సమాజానికి ఎంతో నష్టం జరుగుతుంది.

విద్య, వైద్యం, పరిశ్రమలు, వైజ్ఞానికంగా ప్రజలు మెరుగైన ఫలితాలు సాధించడానికి జరగవలసిన కృషి ఇంకా చాలా ఉంది. ప్రభుత్వాలు దానిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి.
ప్రపంచ జనాభాలో 2022 మైలురాయి సంవత్సరమని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియోగ్యుటెరస్ చెప్పారు. ఈ యేడాది ప్రపంచంలోని మొత్తం జనాభా 800 కోట్లకు చేరుతుంది. జనాభా ఇదే స్థాయిలో పెరిగితే ఉత్పన్నమయ్యే దుష్పరిణామాల గురించి ఆందోళన చెందేవారు కూడా ఉన్నారు. అయితే మానవ వనరులను గరిష్టంగా వినియోగించుకోగలిగితే పెరిగిన జనాభా వల్ల సత్ఫలితాలే లభించగలవన్నది మేధావుల అభిప్రాయం.
జనాభా పెరిగితే నిరుద్యోగిత పెరుగుతుందనే అభిప్రాయం కూడా చాలా మందిలో ఉంది. కానీ మానవ వనరులను గరిష్టంగా ఉపయోగించుకుంటే నిరుద్యోగిత తగ్గుతుందని తాజా గణాంకాలను చూస్తే అర్థమవుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనాభా, నిరుద్యోగిత నిష్పత్తిని పరిశీలిస్తే తొలిసారి 20-21లో తగ్గుదల ఎక్కువగా కనిపించింది. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లే ఇది సాధ్యమైందన్నది విశ్లేషకుల అభిప్రాయం. కేంద్ర కార్మిక శాఖామంత్రి ఇటీవల రాజ్యసభకు అందజేసిన లిఖితపూర్వక సమాచారం ప్రకారం గ్రామ ప్రాంతాలలో నిరుద్యోగిత 18-19లో 5 శాతం నుంచి 20-21లో 3.3 శాతానికి తగ్గింది. అలాగే పట్టణ ప్రాంతాలలో 18-19లో 7.6 శాతం నుంచి 20-21లో 6.7 శాతానికి తగ్గింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత మెరుగైన ఉపాధి కల్పన పథకాలు రూపొందించి అమలు చేస్తే నిరుద్యోగిత మరింత తగ్గుతుంది.

## మందగించిన అభివృద్ధి

ఆశాజనకమైన అంశాలు అనేకం ఉన్నా, కొన్ని నిరాశాజనకంగా కూడా కనిపిస్తాయి. పండిట్ నెహ్రూ, ఇందిరాగాంధి హయాంలో సాగినంత అభివృద్ధి, తర్వాత కాలంలో కొంత మందగించినట్లుగా కనిపిస్తుంది. పాలకులలో పట్టుదల, దీక్ష కొరవడడం, ప్రాథమ్యాలు మారడంతో కొన్ని కీలక రంగాలలో సైతం అభివృద్ధి తగినంతగా జరగలేదనే వాదనలు కూడా ఉన్నాయి. బాలలకు పౌష్టికాహారం, శిశు మరణాల రేటు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం వంటి అంశాలలో ఇంకా వెనుకబడి ఉన్నామనే చెప్పాలి. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాలను సైతం రూపొందించినా, ఇంకా అనేక చోట్ల బాలకార్మికులు పని చేస్తూ మనకు కనిపించడం తరచుగా జరుగుతున్నదే. అలాగే ప్రాథమిక విద్యను నిర్బంధం చేసినా ఇంకా బడులంటే తెలియని బాలలు మన దేశంలో 18 శాతం ఉన్నట్లు కొన్ని సర్వేలు చెబుతున్నాయి. అలాగే శిశు ఆరోగ్యంలో కూడా, శిశు వైద్యంలో కూడా కొంత వెనుకబడి ఉన్నట్లే అనుకోవాలి. రోబోలు తయారు చేస్తున్న మాట నిజమే అయినా, ప్రాథమిక విద్య సైతం అందని బాలలు





ఇంకా పెద్ద సంఖ్యలోనే ఉన్నారనడం కూడా నిజమే అని చెప్పాలి. అలాగే సమాజంలోని వివిధ వర్గాల మధ్య వ్యత్యాసాలు కూడా రాను రాను పెరుగుతున్నాయిగానీ తగ్గడం లేదు. సంపదను సమాజంలోని విభిన్న వర్గాలకు పంపిణీ చేయడంలో అంతరాలు అధికంగా ఉండడంతో 'నియోరిచ్' వరాలు ఒక వంక పెరుగుతుండగా, ఆకలితో అలమటించేవారు కూడా మరోవంక అధికంగానే కనిపిస్తున్నారు. సమాజంలో ఇవి రెండూ రెండు పార్శ్వాలు. ఏ పార్శ్వం పరిణామం పెద్దదిగా కనిపించినా సమాజంలో అశాంతి పెరిగిపోతుంది. అయితే ప్రభుత్వాలు ఈ విషయంలో సమతౌల్యత పాటించలేకపోతున్నాయనే అనిపిస్తుంది.

## మహిళా సాధికారత పెరగాలి

మహిళలు, వారి హక్కుల పరిరక్షణకు జరుగుతున్న కృషి కూడా గతంలో కంటె మెరుగుపడినా, ఇంకా తక్కువే అని చెప్పాలి. మహిళా సాధికారత అనే మాట తరచుగా వింటాం కానీ, మహిళలకు సమానావకాశాలలో మాత్రం ఇంకా ఆశించిన ఫలితాలు లభించడం లేదనే చెప్పాలి. వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఇటీవల విడుదల చేసిన నివేదికను చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. మహిళలు విమానాలు నడుపుతున్నారనీ, సైన్యంలోకి ప్రవేశిస్తున్నారనీ కనిపించే వార్తలు ఒకటి, అర మాత్రమే.
వాస్తవానికి మహిళా సాధికారత మన దేశంలో అంతంత మాత్రమే అని గణాంకాలు చూస్తే తెలుస్తుంది. మహిళా సాధికారతలో భారత్ ఎక్కడో 140వ స్థానంలో ఉన్నదంటే ఎంత వెనుకబడి ఉన్నామో అర్థమవుతుంది. దక్షిణాసియాలో బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్ సైతం మనకంటె ముందు నిలువగా, ఒక్క పాకిస్థాన్ మాత్రమే మన తర్వాత నిలిచింది. 2020 సంవత్సరం నివేదికలో భారత్ 112వ స్థానంలో నిలువగా, 21లోకి వచ్చేసరికి 140వ స్థానానికి పడిపోయింది. డబ్లుఇఎఫ్ నివేదిక ప్రకారం, పురుషులతో సమానంగా మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తే ప్రపంచ ఎకానమీకి అదనంగా సమకూరే మొత్తం 28 ట్రిలియన్ డాలర్లని అంచనా. మన కరెన్సీ ప్రకారం 22 కోట్ల కోట్లన్న మాట. మహిళా సాధికారతలో చాలా వెనుకబడి ఉండడంతో ఆ సంపదలో 70 శాతం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. మహిళల సాధికారత పెంచడానికి ప్రభుత్వాలు ఆచరణాత్మకమైన ప్రణాళికలు రూపొందించి కృషి చేయవలసి ఉంది.

## మౌలిక వనరుల వృథా అరికట్టాలి

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన సందర్భంగా ప్రతి రాష్ట్రంలోను, ప్రతి ఇంటిలోను






సంబరాలు జరుపుకోవడం చాలా ఆనందకరమైన విషయమే అయినా, అభివృద్ధి సూచికల్లో భారత్ కొన్నింటిలో ముందుకు వెళ్లినా, మరికొన్నిటిలో ఇంకా వెనుకబడే ఉండడం కొంత బాధను కలిగిస్తుంది. అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వనరులూ సమృద్ధిగా ఉన్నాయి. ప్రపంచంలో మౌలిక వనరులు అధిక శాతం ఉన్న మొదటి 15 దేశాలలో భారత్ కూడా ఉంది. అది చాలా సంతోషించవలసిన అంశమే. కానీ ఆ వనరులను సమర్థవంతంగా వినియోగించుకొంటున్న దేశాలలో మాత్రం చాలా వెనుకబడి 72వ స్థానంలో ఉంది. అంటే మన దేశంలో సగం పైగా మౌలిక వనరులు వృధా అవుతున్నాయన్న మాట. ఈ విషయం మన ప్రభుత్వాలకు తెలిసినదే అయినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో అనేక రంగాలపై చీకటిఛాయలు ముసురుకొంటున్నాయి. ప్రపంచంలోని ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం మన్ననలందు కొంటోంది. జడిపి (స్థూల దేశీయ ఉత్పత్తి) వృద్ధిరేటు 6 నుంచి 7 శాతం మాత్రమే ఉంటోంది. నిజానికి దీనిని 12,13 శాతం వరకు పెంచవచ్చు. కానీ మన ప్రభుత్వాలు తగినంతగా కృషి చేయకపోవడం




వల్లనే ఈ వెనుకబాటు కనిపిస్తోంది. పంచవర్ష ప్రణాళికలను రద్దు చేసి, ఆ స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేసిన తర్వాత అభివృద్ధి మరింతగా పెరగవచ్చనుకొన్నారు గానీ, 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా పరిస్థితి మారింది.

## కొన్ని ఆశలు.. మరికొన్ని నిరాశలు..

అన్ని సంవత్సరాలు ఒకేలా ఉండకపోవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు ఎంతో నష్టాన్ని తేవచ్చు. మొత్తం ఆర్థిక వ్యవస్థ కుదేలు కావచ్చు. ఎన్నోసార్లు జరిగింది కూడా. ఎన్ని సార్లు ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనా మళ్లీ నేలను తాకిన బంతిలా పైకి లేవడం భారత్ అదృష్టాలలో ఒకటి. అపరిమితమైన ప్రకృతివనరులు, అమితంగా పెరిగిన మానవవనరులు మన దేశాన్ని ఎన్నిసార్లు కింద పడినా తిరిగి పైకి లేపుతున్నాయి. ప్రపంచ వస్తువుల వాణిజ్యంలో భారత్ వాటి 16 నుంచి 17 శాతానికి పెరిగిందంటే వనరులను ఓ 60 శాతమైనా వినియోగించుకోవడం వల్లనే. ది ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ ప్రకారం 2021 డెమొక్రసీ ఇండెక్స్ గ్లోబల్ ర్యాంకింగ్‌లో భారతదేశం 46వ స్థానంలో ఉంది. నార్వే అగ్రస్థానంలో ఉంది. అంటే ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా ఇంకా అభివృద్ధి చెందవలసిన అవసరం కనిపిస్తోంది.

## పెరుగుతున్న అవినీతి

అభివృద్ధిని మింగేసే రాక్షసి అవినీతి అనుకుంటే, దాని ప్రభావం భారత్‌లో ఎక్కువే కనిపిస్తుంది. అంతర్జాతీయ అవినీతి సూచిక ప్రకారం భారత్ 85వ స్థానంలో ఉన్నదంటే అన్ని రంగాలలోను మన దేశంలో అవినీతి ఎంతగా తాండవిస్తున్నదో అర్థమవుతుంది. అవినీతి చాలా తక్కువగా ఉన్న దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. అందుకే మనం అభివృద్ధి చెందుతున్నా, అవినీతి రకరకాలుగా అడ్డుపడుతోంది. ఆ అవినీతిని కనీస స్థాయికి తగ్గించగలిగితే అభివృద్ధి గరిష్ఠ స్థాయికి చేరుతుంది. 75 సంవత్సరాల చరిత్రలో మన దేశం కూడా చాలా ముందుకు వచ్చింది. అయితే రావలసింది ఇంకా ఉంది. ఇప్పుడు మన దేశం మెరుస్తున్న త్రివర్ణ పతాకం. చీకటిని తిడుతూ కూర్చోదంకంటె వెలుగులు అంతటా నింపడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలి. భారత స్వాతంత్ర్యం ఈ వజ్రోత్సవాలు దాటి నూర్నేళ్ల పండేగ జరుపుకొనే సమయానికి అన్నిటా మొదటి స్థానానికి చేరుకోవాలనే దీక్ష అందరిలో కలగాలి. ఆ మహా సంకల్పంతోనే అందరూ ముందుకు కదలాలి. మన విజయాలను పాడుకుంటూ అపజయాలను దాటి వెళ్లాలి. అందుకు ఈ వజ్రోత్సవాలు మహా సంకల్పం కావాలి. మహాకవి శ్రీశ్రీ అన్నట్లు పాడవోయి భారతీయుడా.. ఆడిపాడవోయి విజయగీతిక.. ❑



# ఆశల మంచు దుప్పటి

**ఈ** రేయి తెల్లవారకముందు
మంచు పొత్తిళ్లలో
ప్రకృతి పురుడు పోసుకుంది
పూలగుత్తుల పాపలతో
తనువు తీయగా ఊపిరి తీసుకుంది
ఉదయం మత్తుతో ముఖం కడుక్కుంది
నా హృదయం నీ కోసం
కొత్త వలువలు తొడుక్కుంది
దశాబ్దాల నిరీక్షణలో
నీ కోసం పిచ్చివాడినై
విరహపు వీధులలో వెర్రిగా అరిచాను.
నా గుండె పొరలలో
అరలు అరలుగా పేరుకున్న
ఒంటరితనంలో
నీ గుండెగొంతు మారుమోగింది.
నీ వలపు తలపులు
తెరలు తెరలుగా వచ్చి
నన్ను ఓదార్చి సేదదీర్చాయి!
నా అంతరంగంలో ఓ పిచ్చి ఆశ
నిరంతరమూ తొంగి చూస్తూనే వుంటది.
ఏదో ఓ రోజు
తప్పక నువ్వొస్తావని..
ప్రేమ పరిమళాల చందనంతో
నా ఎదలోగిలిని
సుసంపన్నం చేస్తావని.
గుండెలోతుల్లో ఆకాశమంత ఆశ!
నా ఆశల మంచు దుప్పటిని
కరిగిపోనివ్వకు ప్రేయసీ!
ఊహాజనితమైన
నీ స్పర్శలోని కస్తూరి పరిమళాలను..
నా బతుకు పుస్తకంలో
నీ దస్తూరి ఆనవాళ్లుగా
అలాగే ఉండనివ్వు॥

**- విడదల సాంబశివరావు**

---

# వలస నిరీక్షణ




**కుల** వృత్తులెన్నైనా/ వృత్తి ధర్మమొకటే
కడుపు నింపుకునే పని/ ఆకలి ఎవరికైనా నినాదమే.
దారి పొడుగునా ఎన్ని పనులున్నా
కావాలనే తప్పుకు తిరిగే పని కార్యం
మనిషి ఎలాగైనా చావొచ్చుగానీ
ఆకలితో అలమటించి చావకూడదు.
మెతుకు కోసం తహతహలాడే పేగులు
బంధాన్ని పెనవేసుకున్న అనుబంధాలు
మధ్య మధ్యలో దూరమవుతాయేగానీ
ఆకలి కేకలు వెంటాడే ఓ నిరీక్షణ.
వలసూళ్లు పోయినంత మాత్రాన
పని దొరికేనా నెలకొకసారైనా
పసిబిడ్డకు పాలు దొరికేనా ఈసారైనా
పసిప్రాణాలు కాపాడుకునేందుకు ఏ పనైనా.
మాకు మేడలు మిద్దెలవసరం లేదు.
విలాసాలు, అలంకారాలు అసలు వద్దు
మా కష్టానికి కాస్త కూడు గుడ్డ..
గూడు లేకున్నా మా వలస పయనాలెన్నో.
ఈ విశ్వాంతర గోళం చుట్టూ చుట్టి
పని కోసం.. వెతికి వెతికి
కారుచీకట్లను చీల్చిన మా కండరాలు
కనుమరుగయ్యేను ఆ నీలాకాశంలో.

**- దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు**

---

## వాన నానీలు

**కురిసి** కురిసి
చిన్నబోయింది వాన,
పేదోని గుండెబరువు
మొయ్యలేక!
వాన
అన్నిటినీ ఏకం చేసింది,
మనుషులనే
కలపలేకపోయింది!

చల్లని చినుకులుగా
కురిసిన వాన,
గాయాలను
మొలిపిస్తోంది!
మల్లెల వంటి
చినుకులే
ఇప్పుడు నిప్పులై
సెగలు కక్కుతున్నాయి!

వాన కోసం చూసాం
ఎండ కోసం చూస్తున్నాం,
లేనిదానికోసమే
మన ఆరాటం!

**- పుట్టి గిరిధర్**



## కృపాకర్ మోగిస్తున్న కవిత్వ దండోరా

'రాత్రి తగలబడ్డ గుడిసెవా/ నా మాదిగతనం అంతరించిపోతున్నది/ నా కులం తప్పుడుదా? నాకేంటి మాదిగ దుఃఖరాగం?' అని నినదిస్తున్న కృపాకర్ మాదిగ దళితోద్యమ నాయకుడిగా సుప్రసిద్ధుడు. మూడు దశాబ్దాలకు పైగా కవిత్వం రాస్తున్న కృపాకర్ కులనిర్మూలనావాది. జీవితంలోనైనా, సాహిత్యంలోనైనా అన్ని రూపాల్లోని వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడటమే ఈయన కవిత్వనైజం. పర, తమ భేదం లేదు. దళితుల పేరిట మాలకులమే అత్యధికంగా ప్రయోజనం పొందుతున్నదనీ దళితుల కులాలందరికీ రిజర్వేషన్లు సమానంగా అందడంలేదని కవి ఆవేదన. 'ఏ వూళ్ళోనన్నా మా పిలగాళ్లకి మీ పిల్లల్ని ముడేస్తారా?' అంటూ దళితుల మధ్య వున్న సాంస్కృతిక వివక్షని ఎత్తి చూపుతూ మాలన్ని ప్రశ్నిస్తాడు. యింకొక అడుగు ముందుకేస్తు 'మనమంతా ఒక్కటిగా లేము/ మనమధ్య కొంచం మంచం పొత్తులు లేవు' అన్న నిజాన్ని నిర్భయంగా వెళ్లబుచ్చుతాడు. 'యుద్ధమైనా శాంతియైనా/ కరచాలనమవుదాం/ హక్కులను భాగించుకుందాం/ అధికారాన్ని సాధించుకుందాం/ న్యాయంగా 'పంచుకుందాం..రా!' అని మాలలకు పిలుపునిస్తున్నాడు. కృపాకర్ గొంతుక కేవలం మాదిగలది కాదు. కృపాకర్ మాదిక వ్యక్తిత్వ, సాహిత్యాలను విశ్లేషిస్తూ ఎండ్లూరి సుధాకర్, దార్ల జూపాక సుభద్ర, బి.ఎస్.రాములు, జి.లక్ష్మీనరసయ్యగారలు అందించిన పీఠిక లు ఆయన విరాట్ స్వరూపాన్ని సాక్షాత్కరింపజేస్తాయి.

**(పంచుకుందాం రా! రచన: కృపాకర్ మాదిగ, వెల: రూ200, ప్రతులకు: జూపాక సుభద్ర, ఫ్లాట్ నెం.297, సెక్రటేరియట్ కాలనీ, గచ్చిబౌలి, హైదరాబాద్)** **- రమణ వెలమకన్ని**

## ఇంటింటా ఉండవలసిన ఉద్గ్రంథం



30 సంవత్సరాలుగా పలు ప్రముఖ తెలుగు పత్రికలతో అనుబంధం వేలకు మించిన వ్యాసాలు, పత్రికా నిర్వహణ 50కి పైగా గ్రంథాల ప్రచురణ పలు సాహితీ సంస్థల, వేదికల నిర్వహణలో తనదైన ప్రత్యేకత, నేషనల్ బుక్ ట్రస్టుకి సలహాదారుగా తెలుగుజాతికి సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి చీకోలు సుందరయ్యని ఎరుగని తెలుగు పాఠకుడుండడు అన్నమాట అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు. పి.వి.నరసింహారావు, కె.వి.రమణాచారి, కె.శివారెడ్డి లాంటి తెలుగు జాతి రత్నాల పరిచయం చేసినా కావ్యాల్లో అలంకారాలు, ఆరోగ్యసూత్రాలు, యక్షగానం హరికథ బుర్రకథలాంటి సముద్రమంతటి లోతైన విషయాలను చిట్టిపొట్టి వ్యాసాల్లో పరిచయం చేసినా కాలజ్ఞానం శతకాల పుట్టుపూర్వోత్తరాలు, గేయనాటికలు, తెలుగు గొంతుల్ని సవరించిన బెంగాలీల గురించి రాసిన 'శుద్ధ వచన ధారాశుద్ధి'తో రంగతరంగ లాస్యం గావించినా పదపదంలో జర్నలిస్టుగా 'క్రిటిక్'గా అక్షర పయనాన్ని గావించిన విలక్షణ కృషీవలుడు సుందరచనానందుడు ఈ సుందరుడు! ఏళ్ల తరబడి సాగించిన కృషి ఫలితం ఈ తరతరాల తెలుగు. తరతరాల తెలుగు-2, విశేషాంశాలు మొదటి పుస్తకంగా, సాహిత్యాంశాలు రెండవ పుస్తకంగా వచ్చాయి.

**(తరతరాల తెలుగు విశేషాంశాలు, రచన: చీకోలు సుందరయ్య, వెల: రూ: 160, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకశాలలు)** **- కూర చిదంబరం**

# పుస్తక సమీక్ష

## 'జ్ఞానప్రబోధం 'వైజయంతి' కావ్యసంపుటి'

చివుకుల గోపాల కృష్ణమూర్తి దంపతుల సహకారంతో వెంపరాల సూర్యనారాయణశాస్త్రి ముందుమాటతో ఈ కావ్య సంపుటి ప్రారంభమవుతుంది. శంకరావతరణము, అమరుకావ్యము, సంస్కృతంలో శబ్దవైశిష్యం అర్థగాంభీర్యం గల గొప్ప కావ్యాలు. వీరు అల్లిపూర్ జైలును గూడ జైలనుటి సాహసకృత్యమిదొక్క విశ్వవిద్యాలయ మంటకుందగినది' భారతాంబికా శతకంలో అంటారు. కవి 1922 ప్రాంతంలో తెలియచర్ల జమీందారుగారి ఆస్థాన కవి. గాంధీ ఆంధ్ర జాతీయ మహా విద్యాలయంలో 1932లో పనిచేసారు. సి.ఆర్. రెడ్డి కళాశాలలో పని చేసారు. కాంగ్రెస్‌లో వున్నారు.



మల్లావధానిగారు ఎన్నో కావ్యాలు రాసారు. వాటిలో అమరుకావ్యం, భారతాంబశతకం, విద్యార్థిశతకం, శంకరావతరణం, శివనివేదనం, ఆవిషట్కము, బుతుషట్కము, పుష్పవివేకము, అశ్రుతర్పణము, పండిత రాయలు (నవల) లాంటివి రాసారు. ఆంధ్రరాష్ట్రావతరణోత్సవం సందర్భంలో రాసిన ఈ కింది పద్యం (గీతం) ఆలోచింప చేస్తుంది. ఇదె నవంబరు మాసాన మొదటితేది, మూడుముక్కల నొకటిగా గూడగట్టినట్టి యాంధ్రప్రదేశ రాష్ట్రావతరణ, ధూర్వహం బాంధ్రజాతికి పర్వదినము అంటారు. స్వాతంత్ర్యోత్సవ సందర్భమున జరిగిన పద్యాలు ఎంతో అలరిస్తాయి. కార్మిక సోదరుడు పంచాయితీ రజతోత్సవ సందర్భంలో రాసిన పద్యాలున్నాయి. **(వైజయంతి, రచన: గరిక పాటి మల్లావధాని, వె: రూ 200, ప్రతులకు: గరికపాటి శివరామకృష్ణ శర్మ, 416, కొత్తపేట, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

## కొవ్వలి గురించిన అద్భుత ఆవిష్కరణ

వెయ్యిన్నొక్క నవలలు రాసిన నవలా సాహిత్య సార్వభౌమ కొవ్వలి లక్ష్మీనరసింహారావు గురించి, డాక్టర్ సిహెచ్. సుశీలమ్మ తెలుగు పాఠకులకు అపురూపమైన, అన్వేషణా రచన అందించారు. ఆధునికాంధ్ర సాహిత్యరంగంలో, వ్యవహారిక భాషా పరంగానూ, కుటుంబాలలో మహిళలు ఎదుర్కొనే సమస్యల దురాచారాలపై తన కలాన్ని ఝళిపించిన కొవ్వలి నవలల వెల్లువ, తెలుగు నాట జనబాహుళ్యంలో ముఖ్యంగా మధ్యతరగతి మహిళలలో పఠనాసక్తి పెంచటమే కాక భాషా, భావ చైతన్యానికి మార్గం చూపించింది. ఇరవై అయిదేళ్ల వయసుకే 400 నవలలు, 35 ఏళ్ల వయసుకు 600 నవలలు జీవితకాలంలో మొత్తం 1001న నవలలు రాసిన కొవ్వలి లక్ష్మీనరసింహారావు జీవిత విశేషాలను కొత్తతరానికి, రచయిత్రి డా.సుశీలమ్మ, మహత్తర బాధ్యతగా సాహితీదీప్తి ప్రసరింపచేయటం, మరుగునపడ్డ ప్రతిభామూర్తికి సముచిత స్మరణీయ నివాళి ఘటించటం ఒక అద్భుత ఆవిష్కరణగా భావించక తప్పదు. ఇంటర్వ్యూలు, సేకరణలు, స్వీయశోధనలు, నవలల పేర్లు కొవ్వలి వారిని గురించిన ఎన్నో విశేషాలు ఈ పుస్తకంలో పదిల పరిచటంలో రచయిత్రి అనన్య సామాన్య సత్కృషితో, సమీక్షించారు. కొవ్వలి వారి జీవితాన్ని కొత్త తరానికి అందించే కరదీపిక యిది.



**(శ్రీకొవ్వలి లక్ష్మీ నరసింహారావు, రచన: డా॥ సిహెచ్.సుశీలమ్మ, వెల: రూ.100, ప్రతులకు: 214, నారాయాద్రి, ఎస్.వి.ఆర్.ఎస్. బృందావన్, సరూర్‌నగర్, హైదరాబాద్)** **- ఎర్రమిల్లి**



# ఎన్నెన్నో వర్ణాలు.. మరెన్నో భావాలు

కాళంరాజు వేణుగోపాల్

**ప్రతి** ఫొటో వెనుక ఓ అందమైన జ్ఞాపకం. ఓ మర్చిపోలేని కథ. ఓ ఆశ్చర్యకరమైన అనుభూతి దాగుంటుంది. అలాంటి జ్ఞాపకాల్ని తట్టిలేపి మళ్లీ మళ్లీ తనివితీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చే తీపిగుర్తులు ఫొటోలు మాత్రమే. మధురమైన జ్ఞాపకాలను పదిలపరచుకోవడానికి ఆ ఫొటో ఎంతో ఉపయోగపడుతుంది. అందుకనే నేటి దైనందిన జీవితంలో ఫొటోగ్రఫీ ఒక భాగంగా మారింది. వర్తమాన అంశాలని భవిష్యత్ తరాలకు అందిస్తుంది. మధుర జ్ఞాపకాలని తరతరాలకి భద్రపరుస్తుంది. పండుగలు, పబ్బాలు, వివాహాలు, వేడుకలు, విహారాలు, విషాదాలు, విలాపాలు, సాహసాలు, సరదాలు.. ఇలా అన్నిటికీ ఫొటో సాక్ష్యంగా నిలుస్తుంది. ఇంకో మాటలో చెప్పాలంటే ఎన్నో భావాలను, ఇంకెన్నో అనుభూతులను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఫొటోగ్రఫీకి ఉంది. ఒక్క చిత్రం ఎన్నో వర్ణాల పెట్టు.. మరెన్నో భావాల కనికట్టు.. కోటి భావాలను కూడా చక్కగా తెలియజేసేదే ఒక చిత్రం. ఒక మాటకంటే ఓ దృశ్యం ఎంతో కాలం గుర్తుండిపోతుంది. ఓ మంచి ఫొటో ఆసక్తిని కనబరుస్తుంది. ఆహ్లాదాన్ని పంచుతుంది. జీవితంలో అత్యంత సంతోషకరమైన క్షణాలను, గత స్మృతులను నెమరు వేసుకోవడం ఫొటోలతోనే సాధ్యం. నోటి మాటలతో చెప్పలేనిది ఒక్క ఫొటోతో చెప్పొచ్చు. మనసు దోచే దృశ్యాలు, ఆలోచింపజేసే రూపాలు వెరసి ఫొటోగ్రఫీ. అంతటి శక్తివంతమైనది ఫొటోగ్రఫీ. కేవలం ఒక్క ఫొటోతో ఎన్నో భావాలను బాహ్య ప్రపంచానికి తెలియజేసే అద్భుతమైన శక్తి ఒక్క ఫొటోగ్రఫీకే ఉంది. కనుకనే మానవ జీవితానికి ఈ ఫొటోగ్రఫీకి అవినాభావ సంబంధం ఉంది. కాలగర్భంలో కలిసిపోయిన ఎన్నో విషయాలను, తియ్యటి అనుభూతులకు ఫొటోలే నిదర్శనంగా నిలుస్తాయి.



> అందమైన జ్ఞాపకాలు, మర్చిపోలేని అనుభూతులు, చెరిగిపోని మధుర స్మృతులు, విషాద సన్నివేశాలు, వెలకట్టలేని సందర్భాలు ఏవైనప్పటికీ పది కాలాల పాటు పదిలంగా మన కళ్లముందు ఉంచుతూ, వంద మాటలతో చెప్పలేనిది ఒకే ఒక్క క్లిక్‌తో చెబుతూ మనలను గత జ్ఞాపకాల దొంతరలోకి తీసుకెళ్లి హృదయాన్ని అవ్యాజనుభూతులకు గురి చేస్తూ, కరిగే కాలంలో పరుగెత్తే జీవనయానాన్ని వెనుతిరిగి చూసుకోవడానికి మనకు మిగిలే తీపిగుర్తులే ఈ ఫొటో.

బ్లాక్ అండ్ వైట్‌తో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాలానికి అనుగుణంగా కలర్‌ఫుల్‌గా మారింది. దీంతో ఫొటోగ్రఫీ రోజురోజుకు ఎన్నెన్నో ప్రత్యేకతలను పరిచయం చేస్తూ కొత్త పుంతలు తొక్కుతోంది.

ఆధునిక కాలంలో వీడియోలు, డిజిటల్ లాంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం చూస్తుంటే ఫొటోగ్రఫీకి సమాజంలో ఉన్న గుర్తింపు తెలుస్తోంది. ఫొటోగ్రఫీ శక్తిసామర్థ్యాలను తెలియజేస్తూ దానికి ఒక గౌరవ ప్రదమైన రోజును ఏర్పాటు చేసారు. అదే ఆగస్టు 19 ప్రపంచ ఫొటోగ్రఫీ డే. మారుతున్న రోజులకు, జారుతున్న కాలాలకు అనుగుణంగా పాత స్మృతులను నెమరు వేసుకోవడానికి మనకు



దోహదం చేసే ఫోటో ప్రక్రియ అయిన ఫోటోగ్రఫీ నేడు ఒక ప్రత్యేక స్థానంలో ఉంది. 1839వ సంవత్సరంలో ఫోటోగ్రఫీ ఆవిష్కరణ జరిగిన తరువాత క్రమంగా ప్రపంచ దేశాలు అన్నిటిలోకి ఈ ప్రక్రియ వ్యాపించటం మొదలైంది. ఈ క్రమంలో మన దేశంలోకి కూడా ఫోటోగ్రఫీ ప్రవేశించింది.

చదువులు, ఉద్యోగాల కోసం దిగే పాస్‌పోర్టు సైజు ఫోటో మొదలుకొని నేడు వంద అడుగులపై సైజుల ఫ్లెక్సీల వరకు వ్యాపించింది కేవలం పట్టణ వాసులనే కాకుండా గ్రామీణులను సైతం ఫోటోగ్రఫీ విపరీతంగా అలరిస్తోంది. కంప్యూటర్ పరిజ్ఞానం కూడా తోడవడంతో ఫోటోగ్రఫీ ఎంతో సులువైంది. ఫోటోగ్రఫీలో ఒకప్పుడు పురుషులు మాత్రమే ఉండేవారు. కానీ ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు కూడా ఈ రంగంపై మక్కువ కనబరుస్తున్నారు. గ్లోబలైజేషన్, సాంకేతిక అభివృద్ధి, మారుతున్న జనాల జీవనశైలి పుణ్యం వల్ల పెరుగుతున్న మీడియా రంగంలో ఉన్న అవకాశాలు, స్వయం ఉపాధికి చక్కటి దారులు వేయడం వల్ల పురుషులతో పాటు మహిళలు ఫోటోగ్రఫీలో రాణించడానికి ఇష్టపడుతున్నారు. బ్లాక్ అండ్ వైట్‌తో మొదలైన ఫోటోల ప్రస్థానం ప్రస్తుతం ఈ రాకెట్ యుగంలో సెల్ఫీలతో తెగ హల్ చల్ చేస్తోంది. ఈ క్రమంలో ఫోటోగ్రఫీ రోజుకో కొత్త పుంతలు తొక్కుతూ ఆధునిక రంగంలో దూసుకెళ్తోంది. తమ ఫోటోలు తామే తీసుకునే 'సెల్ఫీ'ల ట్రెండ్ ప్రస్తుతం నడుస్తోంది. అలా తీసే సెల్ఫీ ఫోటోలు క్షణాల్లోనే సోషల్ మీడియా ద్వారా అందరికీ చేరుతున్నాయి. ఇలా ఫోటోచిత్రణ ఎప్పటికప్పుడు ఆధునికతను సంతరించుకుంటూ ప్రపంచాన్ని ఎప్పటికప్పుడు క్లిక్ కొడుతూ మనకు కిక్ అందిస్తుంది. ప్రపంచంలో సుమారు 80 శాతం మంది ప్రజలు సెల్ఫీలపై తెగ మోజు చూపుతున్నారు. ఇక మన దేశంలో సెల్ఫీల కోసం ఏవేవో ఫీట్లు చేస్తున్నారు. ఇప్పటికీ చాలా మంది



సెల్ఫీలను తీసుకుని ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియాలో పెట్టి అందరి చేత మన్ననలు పొందుతున్నారు. మరికొందరైతే సెల్ఫీలను తీసుకుని ఫోటోని షేర్ చేస్తున్నారు. దీనివల్ల ఫోటోలకు ఎంత డిమాండ్ ఉందో ఇప్పటికే చాలా మందికి అర్థమయ్యే ఉంటుంది. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలకి సంబంధించిన ఫోటోలను తమ ప్రాణాలకు తెగించి చిత్రీకరించడం వివిధ



పత్రికలలో, టీవీలలలో, సోషల్ మీడియాలో చూస్తున్నాం. అలాగే నిజ జీవితంలో ఎక్కడో జరిగే సంఘటనలను ఫోటో తీసి షేర్ చేయడం ద్వారా బాధితులకు సరైన న్యాయం జరిగిన సందర్భాలు కోకొల్లలు. నిజంగా ఇది ఒక సృజనాత్మకతకు వేదుక.

దశాబ్దాలు గడిచేకొద్దీ రకరకాల కెమెరాలు అందుబాటులోకి వచ్చేశాయి. ఇలా నేడు అరచేతిలో ఇమిడిపోయి, కనురెప్పపాటులో క్లిక్ అనిపించే ఫోటోగ్రఫీ వెనుక ఎందరో శాస్త్రవేత్తల శ్రమ దాగి ఉంది. ప్రస్తుతం ఫోటోగ్రఫీ చేయి తిరిగిన ఫోటోగ్రాఫర్ల వరకే పరిమితం కావడం లేదు. చేతిలో సెల్ ఉండి విభిన్నంగా, సృజనాత్మకంగా ఆలోచింపజేసే ప్రతిఒక్కరినీ ఫోటోగ్రాఫర్లుగా తీర్చిదిద్దుతోంది. ప్రాణాలకు తెగించి ఫోటోలు తీసి తాము ఏమిటో నిరూపిస్తున్నారు. అటువంటి వారికి ప్రభుత్వ పథకాలలో తగిన ప్రాధాన్యం ఇచ్చి వారి విలువను పెంచాలి. ప్రస్తుతం ఫోటోకి మరింత డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఫోటోగ్రఫీ వృత్తి చేపట్టినవారి భవిష్యత్తుకి ప్రభుత్వాలు భరోసా కల్పించాలి. వారికి సరైన తోడ్పటు అందించాలి. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోతో జీవితాన్ని ముడి వేసుకొని, అదే ఆలంబనగా జీవితాన్ని కొనసాగిస్తున్న అందరికీ అభినందనలు. ❑





కథ

# నక్క వక్ర బుద్ధి

**ఒక** అడవిలో ఒక నక్క, కుందేలు స్నేహంగా ఉండేవి. ఎల్లవేళలా కలిసి ఉండడం, కలిసి తిరగడమే కాదు ఒకే ఇంట్లో ఉండేవి. అన్ని జంతువులూ వారి స్నేహం చూసి ముచ్చట పడేవి. ముఖ్యంగా నక్కకు పెద్ద పెద్ద జంతువులతో పరిచయాలున్నా, చిన్నది, బలం లేనిది అయినా కుందేలిని ప్రాణంగా చూసుకోవడం అన్నది గొప్ప విషయంగా తోచేది. అందరూ దాన్ని పొగడ్తలతో ముంచెత్తేవారు.

ఒకరోజు కుందేలు ఎక్కడో తప్పిపో యిందని నక్క శోకాలు పెట్టింది. ఎవరు చెప్పినా వినకుండా రెండు రోజులు తిండి మానేసింది. అతి కష్టం మీద మామూలు స్థితికి వచ్చి తిరగడం మొదలె ట్టింది. అయినా ఎవరు మాట్లాడినా కుందేలు ప్రసక్తి రాకుండా ఉండేది కాదు. దానితో నక్కని అందరూ అభిమానించడం, మంచితనానికి, ఆప్యాయతకు రోల్ మోడల్‌గా చెప్పుకోవడం సహజమై పోయింది. ఇంతలో ఎక్కడి నుండి వచ్చిందోగానీ ఒక కాకి అందరినీ పిలిచి చెప్పసాగింది "ఆ నక్క మీరు అనుకున్నట్టు మంచిది కాదు. నమ్మవద్దు".

"అలా ఎందుకు అకారణంగా కూస్తావు, ఏమైందో చెప్పు" అడిగారంతా.

"ఆ విషయం చెప్పను. నక్కబుద్ధి ఎలాగో తెలిసింది. మీరు కూడా ఉత్తి పుణ్యానికే నమ్మకుండా జాగ్రత్తగా గమనించి నిర్ధారణకు రండి".

నక్కకు ఈ విషయం తెలిసింది. ఈ మధ్య తనకు నమస్కారాలు పెట్టేవారు కూడా తగ్గారు. రాను రాను తనని చూసి పలకరించేవాళ్లు కూడా తగ్గిపోతున్నారు. ఆ అడవికి రాజయిన సింహం దగ్గరకు వెళ్లి కాకి వల్ల తన పరువుకి నష్టం కలుగుతోంది కనుక కావు కావు మని కూసేదాన్ని శిక్షించి, తనకు నష్టపరిహారంగా దాని కొంపా, గూడు, సంపాదన ఇప్పించమంది.

సింహం కాకిని పిలిపించి సంగతేమిటని అడిగింది.

"రాజా! మంచీ చెడూ దాగేవి కావు. దొంగబుద్ధి ఉన్న వాళ్లు ఎప్పుడో ఒకప్పుడు బయట పడతారు. తప్పదు. అయితే ఆ విషయం ఒక్కొక్కరికి ఒక్కోసారి తెలుస్తుం ది. ఈలోగా వారి వల్ల మిగతా వాళ్లకు నష్టం జరగ కుండా ఉండాలంటే వారి నిజ రూపం తెలిసినప్పుడు మనకెందుకులే అని ఊరుకోకూడదు. తెలిసిన విషయం నలుగురికి చెప్పాలి".

"చాల్లే నీ కాకమ్మ కబుర్లు. ఏమైందో చెప్పకుండా ఎవరికి వారే తెలుసుకోమంటే ఎలా? ఈలోగా నక్క పరువు, ప్రతిష్ఠలు ఏంకాను?"

"రాజా! ఆ సంగతి అప్పుడే చెప్తే నక్క తన వాదనకు మద్దతుగా మరికొన్ని అబద్ధాలు చెప్తుంది. వాటినే ప్రచారంలోకి తెస్తుంది. మీ సమక్షంలో ఇలాంటి సభలో చెప్తే బాగుంటుందని ఆగాను" అంటూ గొంతు సవరిం చుకొంది. ఏం చెప్ప బోతుందా అని అందరిలో ఆసక్తి, నక్కలో కూడా.

"రాజా, నక్క చెప్పి నట్టు కుందేలు ఎక్కడో తప్పిపోలేదు. ఆ విషయం నక్కకు కూడా తెలుసు. ఒకరోజు వాళ్ళిద్దరూ వెళ్తుండగా అది కాలు జారి సొరంగం అంచులో చిక్కుకుంది. చెయ్యి పట్టు తప్పితే సొరంగం అడుగుకు జారిపోతుం ది. నక్కకి రక్షించడం చేతగాక అందరినీ పిలుచుకొస్తా నని బయలుదేరింది. అటూ ఇటూ చూసి ఎవరికీ చెప్పకుండా తాపీగా ఇంటికి వచ్చి నిద్ర పోయింది. ఇక తిరిగిరాలేదు".

"నీకెలా తెలుసు?" నక్క మనసులోని సందేహమే సింహం అడిగింది.

"నేనక్కడ చెట్టు మీద ఉన్నాను. ఆందోళనతో నక్కని వెంబడించాను".

"నిజమేనా?" నక్కను చూసి సింహం గర్జించింది.

"నిజమే రాజా. కానీ కావాలని చెయ్యలేదు. ఇంటికొచ్చి భోజనం ముగించేసరికి కునుకు పట్టేసింది. ఇలా అయిందని చెప్తే తిడతారని, తెలియనట్లు నటించి ఊరుకున్నాను" నక్క చెప్పింది వినయంగా.

"సిగ్గులేదూ. ఎవరు ఆపదలో ఉన్నా కాపాడడానికి ప్రయత్నించాలి. నువ్వు మాత్రం మిత్రుడు ఆపదలో ఉన్నా నిర్లక్ష్యం చూపావు. చేసిన పనికిగానీ, అలాంటి బుద్ధి కలిగివున్నందుకుగానీ సిగ్గుపడటం లేదు.నీది వక్ర బుద్ధి. నీకీ రాజ్యంలో చోటు లేదు, కనబడకు.. పో"

"పాపం కుందేలు" నిట్టూర్చింది సింహం.

"కుందేలు బాగానే ఉంది. నక్క వాలకం చూసి నేనే సాయం కోసం వెదికాను. దారిలో పోతున్న ఏనుగుపిల్ల విషయం చెప్తే వచ్చి రక్షించింది. దానితోనే వాళ్ల రాజ్యం చూడడానికి వెళ్లింది". అన్ని జంతువులూ హమ్మయ్య అని సంతోషించాయి. సింహం కాకిని సమాచార శాఖకి మంత్రిగా నియమించి గౌరవించింది.

**- డా॥ డి.వి.జి.శంకరరావు**







వార్త ఆదివారం

## బాలగేయం

### మన జెండా

రెప రెపలాడెను మన
జెండా
మూడు రంగుల మన
జెండా
విజయానికి ప్రతీక మన
జెండా
అభివృద్ధికి చిహ్నం మన
జెండా
శాంతికి నిలయం మన
జెండా
సర్వ మత నెలవు మన
జెండా
బహు భాషా కొలువు
మన జెండా
స్వేచ్ఛకు చోటు మన
జెండా
ఐక్యతకు పేరు మన
జెండా
ప్రేమకు మార్గం మన
జెండా
మహనీయుల త్యాగం
మన జెండా
అందుకే ఎగురును మన
జెండా
భారతీయుల మది నిండా

**- కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- బి.వెంకట్,** శ్రీకాకుళం

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. బయోమెట్రిక్ కార్డులంటే ఏమిటి? అవి ఎలా పని చేస్తాయి?




**జవాబు:** వెంకట్! ఖాతాదారులను గుర్తించడానికి వ్యక్తిగతమైన శారీరక లక్షణాలను వినియోగించడాన్ని బయోమెట్రిక్స్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రతి వ్యక్తి వేలిముద్ర, కనుపాప(ఐరిస్) మరొక వ్యక్తితో పోల్చలేని విధంగా ఉంటాయి. ఖాతాదారులను గుర్తించడానికి ప్రస్తుతం పర్సనల్ ఐడెంటిఫికేషన్ నెంబరు(పిన్) వాడుకలో ఉంది. దీనికి బదులు ఈ గుర్తును ఆసరాగా తీసుకోవడం సరికొత్త సాంకేతిక పద్ధతి. పని చేసే విధానం: చేతి ఎముక పొడవు, బరువు; కంటిలో రక్తనాళాల తీరు, వేలిముద్రలు, ముఖం మీద ముడతలు వంటి విభిన్న ప్రామాణికాలను సరిపోల్చడం ద్వారా ఈ టెక్నాలజీ పనిచేస్తుంది. ఖాతాదారుల శరీర సంబంధ గుర్తుల సమాచారాన్ని జాతీయ స్థాయిలో నిర్వహించే డాటాబేస్‌లో నిక్షిప్తం చేసి ఉంచుతారు. డాటాబేస్‌లో ఈ సమాచారానికి తగిన మ్యాపింగ్ ఉంటుంది. స్మార్ట్ కార్డుకు జతచేసే చిప్‌తో ఖాతాదారుని జాతీయ డాటా బేస్‌కు అనుసంధానం ఉంటుంది. ఖాతాదారు చేతిని/కంటిపాపను/ ముఖాన్ని స్కాన్ చేసినప్పుడు ఏర్పడే కొత్త మ్యాపింగ్, డాటా బేస్‌లో ఉండే మ్యాపింగ్‌తో సరిపోల్చుతుంది. డాటాబేస్‌లోని ఖాతాదారు సమాచారంతో సరిపోల్చినప్పుడు బ్యాంకింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. వ్యక్తి గుర్తింపుకు ఇదొక సురక్షిత మార్గం. ఇటువంటి శారీరక విశిష్ట లక్షణాలతో సరైన వ్యక్తిని గుర్తించగలిగే సామర్థ్యం బయోమెట్రిక్ విధానానికి ఆర్థిక సేవల ప్రపంచంలో ప్రాచుర్యాన్ని పెంచుతోంది. బ్యాంకులు, క్రెడిట్ కార్డు కంపెనీలు ఈ విధానాన్ని ఎంచుకుంటున్నాయి.

# వాంగో: పెయింటెడ్ విత్ వర్డ్స్

యామిజాల జగదీశ్

**డచ్** దేశస్తుడైన విన్సెంట్ వాంగోకు చిత్రకళా జగత్తులో ఓ ప్రత్యేక స్థానముంది. 1853 మార్చి 30న జన్మించిన వాంగో 1890 జులై 29న మరణించారు. జీవితాంతం ఆర్థిక ఇబ్బందులు అనుభవించిన వాంగో మానసికంగా అనేక రకాల ఇబ్బందులకు గురయ్యారు. బతికున్న రోజుల్లో కన్నా మరణించిన తర్వాత గొప్ప చిత్రకారుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వాంగో దశాబ్ద కాలంలో రెండు వేలకు పైగా చిత్రాలు గీశారు. వాటిలో ఎనిమిది వందల అరవై ఆయిల్ పెయింటింగ్స్ ఉన్నాయి. వాటిలో ఎక్కువ శాతం తన జీవితంలోని చివరి రెండేళ్లలో గీసినవే. వాంగో గురించి.. "వాంగో పెయింటెడ్ విత్ వర్డ్స్" అనే శీర్షికతో డాక్యుడ్రామా తయారు చేశారు. ఇది బీబీసీ ప్రొడక్షన్‌లో రూపొందింది. బెనెడిక్ట్ కంబర్‌బ్యాచ్ వాన్‌గో పాత్రను పోషించాడు. ఈ డాక్యుడ్రామా విశేషమేమిటంటే సినిమా మొత్తం వాన్‌గో రాసిన అక్షరాలలోని పంక్తులతో రూపొందించడం.




ఆయన తన జీవిత కాలంలో రెండు వేల ఉత్తరాలు రాశారు. వీటిలో కొన్ని అందుబాటులో ఉన్నాయి. అలాగే కొన్ని ప్రత్యుత్తరాలు కూడా. తొమ్మిది వందల రెండు ఉత్తరాలతో ఓ పుస్తకం ఉంది. వాటిలో 819 ఆయన రాసినవైతే మిగిలిన 83 ఆయనకు వచ్చిన జవాబులు. ఆయన ఉత్తరాల పర్వాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. తనకు తాను రాసుకున్నవి కొన్నియితే తనకు రాసిన ఉత్తరాలు మరికొన్ని. ఆయన తన సోదరుడు థియోకు ఆరు వందల యాభై ఉత్తరాలు రాశారు. ఆయన ఇంగ్లీషులో రాసిన ఉత్తరాలు కేవలం అయిదే అయిదు. ఆయనకు ఫ్రెంచ్ భాష బాగా వచ్చు. వాంగో తన సోదరిమణులు, చిత్రకారుడు పాల్ గౌగిన్, స్నేహితులకు రాసిన లేఖలన్నీ సంకలనం చేశారు. వాటిని ది లెటర్స్ ఆఫ్ విన్సెంట్ వాంగోగా ప్రచురించారు. అక్షరాల్లో ఆయన వేసిన కార్టూన్లు కూడా అద్భుతంగా ఉన్నాయి. వాంగో మరణానంతరం, థియో భార్య జోహన్నా 1914లో సేకరించి ప్రచురించిన ఈ లేఖలను సంకలనం చేయడానికి చాలా సంవత్సరాలు పట్టింది.

గుండెల్లో గుబులు రేపుతున్న ప్రేమను అదుపు చేసుకోలేకపోతున్నాననే భావన నాకు కొత్త కాదు. నాకు ప్రేమ అనే విషయం కావాలి. నేను వెతుకుతున్నది అగ్ని తాలూకు ఉచ్చు అని నేను అనుకుంటున్నాను, అది ప్రేమ. ఉదయాన్నే మంచం మీద నుంచి లేచి మీరు ఒంటరిగా లేరని తెలుసుకున్నప్పుడు, మీ పక్కన మరో జీవితం ఉంది, ఇది మిమ్మల్ని మరింత స్నేహపూర్వకంగా చూసేలా చేస్తుంది అంటాడు వాంగో ఓ చోట.

వాంగో రాజీలకు తావివ్వక చిత్రలోకంలో అత్యుతున్నత స్థాయితో జీవించి మరణించారు. ఆయన తన రంగులతో పాటు జీవితం తనకిచ్చిన చేదు, అవమానాల గుండా పయనించాడు. ముదురు రంగులు విముక్తికి చిహ్నాలుగా మారాయి. పొద్దుతిరుగుడు పువ్వులు మనస్సాక్షి కళ్లుగా రూపాంతరం చెందాయి. పొద్దుతిరుగుడు పువ్వులు మనస్సాక్షి కళ్లుగా రూపాంతరం చెందాయి.

చిత్రకళ, మేధావితనంతోనే ఆయన జీవితాన్ని అర్థం చేసుకోవచ్చు.

సెయింట్- రెమీలో ఆయన మానసిక చికిత్స రోజులలో వాంగో సృజనాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకుంది. వాంగో పసుపు గది, కుర్చీ తిరస్కరించబడిన కళాకారుడి దుస్థితిని మనకు తెలియజేస్తాయి. తన లేఖలలో దృశ్యాలను ఆయన పక్కాగా రికార్డు చేశారు.

సన్నగా కనిపించే స్త్రీ తన ఛాతీపై చేయి వేసుకుని నలుపు రంగు దుస్తులు ధరించి బూడిదరంగు గోడ వెంట నిశ్శబ్దంగా ఏదో దొంగిలించింది. ఆమె గిరజాల జుట్టు, చిన్న గుండ్రటి ముఖం. ఆమె ముఖం గోధుమ రంగులో ఊదా లేదా నారింజ, పసుపు మిశ్రమంతో ఉందా అని నేను నిర్ణయించుకోలేకపోయాను అన్నారొకచోట.

ఆర్లెస్‌లో నివసిస్తున్నప్పుడు వాంగో మానసిక అనారోగ్యంతో ఉన్నాడు. ఆర్లెస్‌లో ఆయన నివాసం ఉండకూడదంటూ ఎనభై మందికి పైగా సంతకాలు చేసి మేయర్‌కు ఫిర్యాదు పత్రం సమర్పించారు. దీనిపై స్పందిస్తూ- ఒక వ్యక్తికి వ్యతిరేకంగా ప్రజలు ఏకమయ్యేంత పిరికివాళ్లను చూడటం ఆశ్చర్యంగా ఉంది. వారు నన్ను స్వేచ్ఛగా ఉండడానికి అనర్హుడని భావించారు. ఇది అవమానకరం. ఇక చెప్పడానికి ఏమీ లేదన్నారు వాంగో.

ప్రజలు దాఖలు చేసిన ఫిర్యాదు పత్రాన్ని డాక్యుమెంటరీలో చూపించారు.

ఈ డాక్యుమెంటరీ చూస్తున్నప్పుడు వాంగోకు మూడు వైఫల్యాల గురించి ఆలోచనలు వచ్చాయి.


బోధకుడు కావడానికి ఆయన చేసిన మొదటి ప్రయత్నం విఫలమైంది. దాని కోసం బైబిల్ లోతుగా చదవండి. ఆయన ఆత్మవిశ్వాసంతో సన్యాసి జీవితాన్ని గడిపాడు.

బొగ్గగని కార్మికుల గ్రామంలో కొంత కాలం బోధించారు. కానీ ఆయన బోధకుడు కాలేకపోయారు.

ఇక రెండవ వైఫల్యం ఏమిటంటే ఆయన ప్రేమించిన స్త్రీలలో ఎవరూ వాంగోను అర్థం చేసుకోలేదు. ఆయన శృంగార కలలన్నీ ఆర్థిక ఇబ్బందులతో దెబ్బతిన్నాయి.

...

ఓ మారు వాంగో తన చెవిని కోసుకుంటారు. సెయింట్–రెమీలో ఆశ్రయం పొందుతారు. ఆయన అక్కడ ఉంటూనే బొమ్మలు గీశారు. అయితే గత అనుభవాలు సృష్టించిన ఉద్రిక్తత, భవిష్యత్తు గురించి తీవ్రమైన గందరగోళం ఆయనను చుట్టుముట్టాయి. గుర్తింపుపై ఆశ లేకుండా, అసమానమైన సృజనాత్మకతతో, ఉన్నతమైన కలలతో పరుగులు తీస్తారు. ఈ చిత్రంలో వాంగో పెయింటింగ్ నేపథ్యాన్ని, దాని ప్రత్యేకతలను అందంగా వివరించారు. బూడిద మేఘాల వెనుక సూర్యుడు మాయమవడం చూస్తుంటే చాలా అందంగా ఉంటుంది. అప్పుడు మీరు నీడలను చూడాలనుకుంటున్నారు. చాలా






అందంగా ఉందని వాంగో ఓ లేఖలో రాశారు. దీనిని బట్టి ఆయనలోని కవితాత్మకత కూడా తెలుస్తుంది. చార్లెస్ డికెన్స్, షేక్స్పియర్, మిల్టన్, ఎమిలీ జోలా వంటి వారి రచనలను ఎంతో ఇష్టంతో చదివిన వాంగో ఓ చోట అంటారిలా: "కళ విషయంలో నిజాయితీ చాలా ముఖ్యం. నేను నిజాయితీగా ఉండాలి. నేనెప్పుడూ వ్యాపారుల వెనుక, సంకుచితత్వం గలవాళ్ల వెనుక పడనని".

వాంగో జపనీస్ పెయింటింగ్స్ చూసి మైమరచిపోయి తన పెయింటింగ్స్‌ని ఆ స్టైల్‌లో వేసే ప్రయత్నం చేసిన సందర్భాలున్నాయి. ఆ ప్రభావం ఆయన పెయింటింగ్‌లో ఎలా వ్యక్తమైందో స్పష్టమైన ఆధారాలతో చూపించారు ఈ డాక్యుడ్రామాలో. షేక్స్పియర్ స్వగతంలా ఉంటాయి వాంగో లేఖలు. ఆయన చిత్రాలు ఓ నాటకాన్ని చూసిన అనుభూతిని కలిగిస్తాయి. వాంగో తన 37వ యేట జులై 29, 1890న తుపాకీతో కాల్చుకుని మరణించినప్పుడు పొద్దుతిరుగుడు పువ్వులు తలకిందులయ్యాయి. గోధుమ పొలాల్లో ఎగిరిన పక్షులు తమ గొంతును కోల్పోయాయి. చీకటి ఆకాశంలో మెరిసిపోతున్న నక్షత్రాలు మృత్యువు ఎప్పటికీ ముగిసిపోలేదని తమలో తాము బాధపడ్డాయి.

ప్రపంచం ఓ గొప్ప చిత్రకారుడిని కోల్పోయింది. చివరలో వాంగో సమాధిని, అతని సోదరుడు థియో సమాధిని చూపించారు. బెనెడిక్ట్ కంబర్‌బ్యాచ్ వాంగోగా అద్భుతంగా నటించారు. ముఖ్యంగా ఆయన ముఖకవళికలు, డైలాగ్ డెలివరీ అద్భుతంగా ఉన్నాయి.

నేను ఎల్లప్పుడూ వెతుకులాటలో ఉంటాను. ఏదో దొరికిందని చెప్పడం కంటే వెతుకుతున్నాను అని చెప్పడం మేలని వాంగో ఓ లేఖలో రాసారు. ఈ డాక్యుమెంటరీ వాంగో అంతులేని ప్రయాణాలు, పశ్చాత్తాపపడని స్వభావం, కళ ద్వారా ప్రాణం పోసుకున్న సృజనాత్మకత, విషాద జీవితాన్ని సంపూర్ణంగా గ్రహించొచ్చు. ❐



**కార్టూన్లకు**

***ఆహ్వానం***

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపేగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 80. sunmag-vaartha@gmail.com

# పరికర్మికా పరిక్రియ

కథ

కురుమయ్య యాదవ్ మేనుగొండ

చుట్టూ ఎటు చూసినా పాల నురగలతో పసిపాప నవ్వులా మనసును ఆకర్షించే అలలు. గత కాలపు నీ నడవడికను చూపే వర్తమానంలా మన అడుగుజాడల్ని చూపే సుతిమెత్తని ఇసుక తెరలు. ఎలాంటి వారికైనా తమ మనసులోని ఆలోచనలను ఒక అందమైన కవిత్వంలా మలచగల ఊహల్ని జనింపచేసే ఆ సముద్రపు ప్రసన్న వదనం అతనిలో చెలరేగే ఆందోళనలకు మాత్రం ఒక పరిష్కారాన్ని చూపలేకపోతున్నాయి.

ఎంతటివారినయినా తమ సమస్యలను మరిపించి వారికి ఒక అలౌకిక ప్రపంచాన్ని పరిచయం చేసే ఆ చెలియలి సాంగత్యం అతని కళ్లకు మాత్రం ఒక లౌకిక వస్తువుగా కూడా దరి చేరడం లేదు.

మనసేమో గత కాలపు అసంపూర్ణత్వం వైపు పరిగెడుతూ, ఆలోచనలేమో భవిష్యత్ అంధకారంలో కొట్టుమిట్టాడుతూ, వర్తమానంలో మనసు-మెదడుల మధ్య పొంతన కుదరక విలవిలలాడుతున్న అతని పేరు శశికిరణ్.

శశికిరణ్ గతంలో ఒక పేరున్న కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసేవాడు. ఐదెంకెల జీతం అవసరాలకు సరిపడా కాదు ఆర్భాటాలకు సరిపడినంత సంపాదన. అందరు ఆకాంక్షించే స్థాయి, అందరూ మెచ్చే హోదా అయినప్పటికీ అతనికి ఇంకా ఏదో వెలితిగానే ఉండేది.

నెలనెలా వచ్చే జీతం అతని జేబు



నిండా చేరుతుందేమో కానీ మనసును మాత్రం తాకటం లేదు.

అతను చేసే ఉద్యోగం అతనికి సకల సౌకర్యాల్ని కల్పిస్తుందేమోగానీ సంతృప్తిని మాత్రం ఇవ్వడం లేదు. మనసులో ఏదో ఒక మూల ఒక చిన్న వెలితి. తాను ఎన్నుకోవాల్సిన మార్గం ఇది కాదేమో అని. మరి తన గమ్యం ఏది? తాను కొనసాగించాల్సిన గమనం ఎటువైపు అని శోధించసాగాడు. అలా తన మనస్సు పొరల్లోకి తొంగి చూడడం ప్రారంభించాడు.

తాను కాలేజీలో ఉన్నప్పుడు ఎన్నో కవితలు, తన మిత్రుల ప్రేమ రాయబారాల కోసం ఎన్నో ప్రేమలేఖలు రాసేవాడు. ఆ కవితలకు ముగ్ధులు అవ్వనివారు ఎవరూ ఉండరు అనడం అతిశయోక్తి కాదు. అలా అప్పుడే తనలోని కళకు ఒక బీజం వేశాడు. కానీ నిద్రలో వచ్చే కలలు నిద్రపోకుండా చేసే కలలు తిండి పెట్టవు కదా. అందుకే దానిని కేవలం ఒక అభిరుచిలానే పరిమితం చేసుకున్నాడు. చివరికి చదువు పైన దృష్టి పెట్టి మంచి ఉద్యోగం సంపాదించాడు.

కానీ గతంలో బతుకుతెరువుకై ఒక స్థానం కోసం పాకులాడిన ఆలోచనలు క్రమంగా తనకంటూ ఒక స్థాయి ఏర్పడిన తర్వాత ఇప్పుడు తన బతుకుకు ఒక గుర్తింపు కోసం అంతర్మధనం ప్రారంభించాయి. సమాజంలో ఒక స్థాయి కావాలంటే తన మెదడులోని ఆలోచనలను నైపుణ్యంగా మలచగల ఉద్యోగవృత్తి కావాలి. కానీ సమాజంలో గుర్తింపు రావాలంటే ఎదుటి వ్యక్తి మనస్సును సమ్మోహనపరిచే కల ఉండాలి.

అందుకే తను కేవలం అభిరుచిగానే పరిమితం చేసుకున్న తన కలను ఒక వృత్తిగా మలచుకోవాలి అనుకున్నాడు. అలా అనుకున్నదే తడవుగా ఉద్యోగం మానేసి తన కళ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

ప్రశాంతమైన ప్రదేశం చక్కటి ఆలోచనలు పునాది వేయగలదని నిశ్చలమైన సముద్రపు ఒడ్డున నివాసం ఏర్పరచుకున్నాడు.

ఎంతోమంది గొప్ప వ్యక్తుల పుస్తకాలు చదవడం ప్రారంభించాడు. అలా కొంత కాలం గడిచిన తరువాత తాను రాయగలనని నమ్మకం కుదిరాక రచనలు చేయడం ప్రారంభించాడు. కానీ జీవితం అనేది ఎవరికీ పూలబాట కాదు. పైకి కనిపించే పూలతో పాటు దగ్గర నుంచి చూస్తేకానీ కనపడని ఎన్నో ముళ్లు ఉంటాయి. అలా తన మార్గంలో తాను ఊహించనింత పురోగతిని సాధించలేకపోయాడు.

అలా ఒక సంవత్సర కాలం గడిచిపోయింది. అప్పుడు అతనిలో ఒక భయం మొదలైంది.. ఉద్యోగం మానేసి, ఎందుకు ఇటువైపు వచ్చానా అని.

ఇప్పుడు నేనేం చేయాలి? అన్నీ వదిలేసి వెళ్లి ఉద్యోగం చేయాలా? లేక ఇంకా కొత్తగా ఏమైనా ప్రయత్నించాలా అని. ఇలా తీరం చేరని అలల్లా ఎన్నో ప్రశ్నలు తన మనస్సులో ఒక సునామీని సృష్టిస్తున్నాయి. అందుకే అలా నిర్లిప్తంగా ప్రపంచంతో పని లేనట్టుగా సముద్రపు ఒడ్డున కూర్చుని ఉన్నాడు.

సరిగ్గా అప్పుడే తన మనస్సుకు ఒక హాయి అయిన పులకింత కలిగింది. అది తన అర్ధాంగి రాకకు సంకేతం అని తన మది చెప్పకనే చెబుతుంది. ఆమె వచ్చి అతని పక్కన కూర్చుంది. కటిక చీకటిన సైతం అందమైన జ్ఞాపకంగా మార్చగల వెన్నెలలా ఎంతటి క్లిష్ట పరిస్థితినైనా జయించగలనన్న మనోధైర్యాన్ని నింపి ఆమె చిరునవ్వును చూసి పెట్టారో, లేక ఎలాంటి వారినైనా సమ్మోహనపరిచిన ఆమె ప్రసన్న వదనం చూసి పెట్టారేమో! అనిపించేలా ఉంటుంది.. ఆమె పేరు చంద్రిక.

తన భర్త మోములో కదలాడే ఆందోళనను చూసి లాలనగా అతని ముంగురులను సరి చేస్తూ, అతని అనిశ్చితికి కారణం ఏమిటి? అని అడిగింది. ఉప్పొంగే పాలకు నీరు చేర్చాను, ఆమె చేతి స్పర్శలో ఉన్న అలౌకికమైన సాంత్వన వల్ల అతని మదిలో చెలరేగే అలజడులు కాస్త సద్దుమణిగాయి.

అతను ఆమె చేతిని తన చేతితో పట్టుకొని చెప్పడం ప్రారంభించాడు.

“జీవితం సాఫీగా సాగిపోయే మార్గాన్ని వదిలేసి ఏదో సాధించాలని మనసు చూపిన కొత్త మార్గాన్ని ఎన్నుకున్నారు. ఆ దారిలో నా గమ్యమే కానీ దానికి భరోసా ఇచ్చే ఏ మార్గం కనబడటం లేదు. ఎన్నో పుస్తకాలు చదివాను, కవిత్వం రాయడానికి కావలసిన ప్రమాణాలు ఎన్నో నేర్చుకున్నాను. అయినా నేను ఎందుకు పరిపూర్ణత పొందలేకపోతున్నాను. నేను ఎందుకు గెలవలేకపోతున్నాను. నా నిర్ణయం వల్ల మన భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందేమోనన్న భయం వేస్తుంది. నేను ఏమన్నా తప్పు చేశానంటావా అంటూ తప్పటడుగులు వేసే ప్రాయంలో తల్లిభరోసా కోసం చేతులు చాపే పసివాడిలా ఆమె సలహా కోసం చూస్తున్నాడు.

ఆమె ఒక చిన్న చిరునవ్వు నవ్వి కింద పడిపోతున్న పిల్లవాడిని హత్తుకొని నీకు నేనున్నాను అని భరోసా ఇచ్చే తల్లిలా, అతని మోమును అపురూపంగా తన రెండు చేతులలోకి తీసుకొని అతని కళ్లల్లోకి చూస్తూ “నువ్వు గెలవడం లేదు అని ఎందుకు అనుకుంటున్నావు. ఈ ప్రపంచంలో గెలుపు అనేది రెండు రకాలుగా వస్తుంది. ఒకటి: పక్కవాడితో పోటీ పడుతూ, వాడికంటే ఒక్క అడుగు ముందుండటం; రెండు: నీతో నీవు పోటీ పడుతూ ఎవరూ ఊహించని అందరూ కలలుగనే స్థాయికి చేరడం. మొదటిది బతుకుతెరువు చూపే ఉద్యోగం అయితే రెండవది నీ లోపల ఉండే కల. ఇన్నాళ్లు నువ్వు మొదటి రంగంలో విజయాన్ని చూసావు. ఇప్పుడు రెండవ రంగంలో ప్రయత్నిస్తున్నావు. అంతే తేడా. అక్కడ గెలుపు నిరంతరం నీ కళ్లకు కనిపిస్తుంది. కానీ ఇక్కడ గెలుపు నీలోనే ఉండి, లోతుగా తరచి చూస్తే కానీ కనపడదు. పుస్తకాలు చదివితేనే కవిత్వం రాయగలం అని ఎవరు చెప్పారు. కవిత్వం అంటే మన ఉద్వేగమైన పరిపక్వత. నీ ఆలోచన అనే గొంగళిపురుగు నీ హృదయంలో నుంచి తనకు తానుగా వెలువడినప్పుడే, అది రంగు రంగుల సీతాకోక చిలుక లాంటి కవిత్వంగా మారగలదు. ఈ ప్రపంచంలో ప్రతి వస్తువు, ప్రతీ పనిలో ఒక ప్రత్యేకమైన అంతఃసౌందర్యం దాగి ఉంటుంది. దానిని చూడగలిగే మనసు నీలో ఉండాలి. చదవగలగాలే కానీ ప్రతి వ్యక్తి ఒక పుస్తకమే, ప్రతి అనుభవం ఒక పాఠమే. తన కళ్ల ముందే చనిపోయిన క్రౌంచ పక్షుల మధ్య ఉన్న ఆ అలౌకికమైన ప్రేమానుబంధమే వాల్మీకి మనసును కదిలించి, అతని నోట ఉత్తమమైన రామాయణ గ్రంథ రచనకు బీజం వేసింది. నాకు నీ మీద నమ్మకం ఉంది. నీ మనసులో ఉన్న పిచ్చి పచ్చి ఆలోచనలను వదిలిపెట్టి, నీ కళ కోసం ప్రయత్నించు, నేను నీకు తోడుగా ఉంటాను”.

**ఆమె “అబ్బో! అంత లేదు నేనేం చేశాను ఒక సగటు భార్యగా నా బాధ్యత నేను నిర్వర్తించాను అంతే కదా. అందులో నా గొప్పతనం ఏముంది?” అన్నది.**

ఆమె మాటలు విన్న తర్వాత మనసుకు ఒకలాంటి సాంత్వన లభించింది. ఆమె చేయి పట్టుకుని “నీ పరిచయం నాకు నన్ను పరిచయం చేస్తే నీతో జీవితం నన్ను ఒక మనిషిగా తీర్చిదిద్దింది. నీవు నాకు కేవలం జీవిత భాగస్వామిని మాత్రమే కాదు, ఒక గురువు, తల్లివి కూడా. నీవు నా జీవిత నౌకకు ఒక దారి చూపించు చుక్కాని వంటి దానివి. పెద్దలు భార్యను కార్యేషు దాసి కరణేషు మంత్రి.. అతని ఎందుకు కీర్తిస్తారో నాకు ఇప్పుడు అర్థమైంది” అంటాడు.

ఆమె అబ్బో! అంత లేదు నేనేం చేశాను ఒక సగటు భార్యగా నా బాధ్యత నేను నిర్వర్తించాను అంతే కదా. అందులో నా గొప్పతనం ఏముంది? అన్నది.

“మిలమిల మెరిసే ఆ జాబిలికి కూడా తెలియదు తాను పంచే వెన్నెల చల్లదనమెంతో, జల జల పారే సెలయేరుకేం తెలుసు తనలోని ఆ నీటి కమ్మదనమెంతో, అలాగే నాతో గమించే నీకేం తెలుసు.. నీ సాహచర్యంలో నేను పొందిన పరిపూర్ణత ఎంతో!”

అబ్బో! ఏంటి కవిగారు మంచి హుషారుగా అయిపోయారు. ఒక విషయం చెప్పనా.. ప్రతి భార్య తన భర్తలోనే తన మొదటి బిడ్డను చూసుకుంటుంది. తన బిడ్డ బాగు కోసం ఆ తల్లి ఏమైనా చేస్తుంది. మరి నా బిడ్డ కోసం నేను ఆమాత్రం చేయలేనా? అంటూ గలగలా పాల కడలిని నురగలా స్వచ్ఛగా నవ్వుతుంది.

అలా తన మనసులోని ఆలోచనలన్నిటికి ఒక సమాధానం దొరకడంతో, ఇప్పుడు అతని మనసు చాలా ప్రశాంతంగా మారింది. ఆమె ఒడిలో తల పెట్టుకొని చుట్టూ ఉన్న ప్రకృతిని చేస్తూ, చంటిపిల్లాడిలా అన్ని బాధలు మర్చిపోయి హాయిగా నిద్రపోయాడు.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త,** నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 80. sunmagvaartha@gmail.com



# ఫొటో సింథటిక్ జంతువులు

జి.మాణిక్యం

**ఈ** సృష్టిలో జీవులన్నీ ఒకే రకంగా ఉండటం లేదు. ప్రతి జీవి ఇంకో జీవికి పూర్తిగా విభిన్నం. మొక్కల నుండి జంతువులను విభజించేది ఆహార ఉత్పత్తి చేయడం మాత్రమే. మొక్కలు వాటి ఆహారాన్ని అవే తయారు చేసుకునే 'స్వయంపోషకాలు, జంతువులు వాటి ఆహారం కోసం, శక్తికోసం ఇతర జీవులపై ఆధారపడి జీవనం సాగించే పరపోషకాలు'. అయితే ఇప్పటివరకు మనకు వృక్ష జీవులు మాత్రమే "కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆహార పదార్థాన్ని తయారు చేసుకుంటుంది అనుకుంటే పొరపాటే. ఇప్పుడు కొన్ని జంతువులు కూడా క్లెప్టోప్లస్టీ విధానం ద్వారా వాటికి కావాల్సిన ఆహారాన్ని అవే తయారు చేసుకుంటూ మొక్కలు మేమే.. జంతువులు మేమే.. భవిష్యత్తుకు దిక్కులు మేమే అంటున్నాయి. జంతువులందు ఈ జంతువులు వేరయా! అని చాటిచెబుతున్నాయి. మొక్కలు, జంతువుల మధ్య ఉన్న విభజన గీతను చెరిపేసే విచిత్రమైన జీవులను శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. దాని గుట్టు తెలిస్తే మానవాళి భవిష్యత్తే మారిపోతుందని అంటున్నారు. ఆ విశేషాలు..

జీవ పరిణామ క్రమంలో చెట్లకు జంతువులకు కనెక్టింగ్ లింక్‌గా 'Euglena" జీవం నిలుస్తోంది. ఇది పాత కథ. ఇప్పుడు కొత్త Kleptoplasty జీవులు ఉనికిని శాస్త్రవేత్తలు గుర్తించారు.

క్లెప్టోప్లస్టీ విధానం: Symbiotic association (సహజీవనం) వలన అతిదేయి జీవి (హోస్ట్) నుండి పరాన్న జీవి(పారసైట్) కిరణజన్య సంయోగ క్రియకు ఉపయోగపడే క్లోరోప్లాస్ట్, క్లోరోఫిల్, జన్యు పదార్థాన్ని శోషించబడి సూర్యరశ్మి సహాయంతో వాటి ఆహారాన్ని తయారు చేసుకునే పద్ధతిని క్లెప్టోప్లస్టీ అంటారు. ఈ పద్ధతిని అనుసరించే జీవులు:

1) సీ స్లగ్ (Alicia chlorotica) : అనే జంతు జీవి యునైటెడ్ స్టేట్స్, కెనడా తూర్పు తీరంలోని నీటిలో నివసించే ఆకుపచ్చ రంగు, ఆకు ఆకారం లో ఉండే శరీరం దీని ప్రత్యేకత. ఇవి ఆల్గే (Vaucheria Algae) ను తింటుంది. కానీ అది శక్తికి మాత్రమే మూలం కాదు. ఈ స్లగ్ కిరణజన్య సంయోగ అవయవాలు(క్లోరోప్లాస్టులు), ఆల్గే నుండి కొన్ని జన్యువులను శోషించ బడుతుంది. తద్వారా క్లెప్టోప్లస్టీ విధానం లో ఆహారాన్ని తయారు చేసుకుంటాయి.

2) లీఫ్ స్లగ్ (Costasiella Kuroshimae) అనేవి షెల్-లెస్ మెరైన్ ఒపిస్టోబ్రాంచ్ గ్యాస్ట్రోపాడ్ మొలస్కులు. ఇవి 5 మిల్లీమీటర్ల నుండి 1 సెంటీమటరు పొడవు వరకు ఉంటాయి. వాటికి రెండు చీకటికళ్లు, రెండు ఖడ్గమృగాలు (Rhinophotes), Chromatophores ఉంటాయి. ఇవి వాటి తలల పైభాగం నుండి వెలువడతాయి. ఇవి గొర్రెల చెవులు లేదా క్రిమి యాంటెన్నాలా కూడా కనిపిస్తాయి. అందుకే వీటిని 'లీఫ్ షీప్' అని ముద్దుగా పిలుస్తారు. వీటి శరీర ఆకృతి కూడా ఆకు వంటి నిర్మాణం కలిగివుండడం కిరణజన్య సంయోగక్రియ కోసం మాత్రమే అనే సందేహాన్ని కలిగిస్తోంది. ఇవి తినడానికి ఏమి లేకున్నా ఏకంగా తొమ్మిది నెలల పాటు బతకగలిగాయని, ఆ సమయంలో క్లోరోప్లాస్టల సహాయంతో సొంతంగా ఆహారాన్ని తయారు చేసుకున్నాయని శాస్త్రవేత్తలు తేల్చారు.

3) సాకోగ్లోస్సా (Elsia clarki) : సాకోగ్లోస్సా జాతులు ఉష్ణమండల, సమశీతోష్ణ మహాసముద్రాలలో ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తాయి. చాలా వరకు మధ్య పసిఫిక్ మహాసముద్రంలో నివసిస్తాయి. వీటిని 'సౌరశక్తితో నడిచే సముద్రపు స్లగ్స్' అని పిలుస్తారు. సాకోగ్లోసన్‌లు ఆల్గేలోని ఫొటోసింథటిక్ అవయవాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా జీవిస్తాయి. అందుకే వాటిని కొన్నిసార్లు "సాప్ పీల్చే సముద్రపు స్లగ్స్" అని పిలుస్తారు. సాకోగ్లోసన్స్ పొడవు 1-3 సెం.మీ. అవి సాధారణంగా రంగులో ఏకరీతిగా ఉంటాయి. ఎందుకంటే అవి తీసుకునే క్లోరోప్లాస్టలు వాటి స్వంత కణాలలో వ్యవస్థాపించబడతాయి.

3) పీ అఫిడ్- (Acrythosiphon pisum) : వీటిని బఠానీ అఫిడ్, లేదా గ్రీన్ డాల్ఫిన్, బఠానీ లౌస్, క్లోవర్ లౌస్ అని పిలుస్తారు.



ఇది అఫిడిడే కుటుంబంలో రసాన్ని పీల్చే పురుగు.

ఇది ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల చిక్కుళ్ల మొక్కల కుటుంబం(ఫాబేసి) తింటుంది. బఠానీ పురుగు జీవశాస్త్ర అధ్యయనానికి ఒక నమూనా జీవి. దీని జన్యువు క్రమం, ఉల్లేఖన చేయబడ్డాయి. అఫిడ్స్ కణాలలో ఒక శిలీంధ్ర జన్యువు కాపీ చేయబడినప్పుడు అవి కెరోటినాయిడ్ల ఉత్పత్తిని ఉపయోగించుకుంటాయని చూపిస్తుంది. వివిధ రంగుల అఫిడ్స్‌లో ఎటిపి వివిధ స్థాయిలు ఉన్నట్లు చూడవచ్చు. అఫిడ్ రంగు తెలుపు, నారింజ, ఆకుపచ్చ వరకు ఉంటుంది.

ఆకుపచ్చ అఫిడ్స్ తెలుపు అఫిడ్స్ కంటే గణనీయంగా ఎక్కువ ఎటిపి కలిగివున్నట్లు కనుగొన్నారు. అయితే నారింజ అఫిడ్స్ చీకటిలో కాకుండా కాంతిలో ఎక్కువ ఎటిపిని ఉత్పత్తి చేస్తాయి. అఫిడ్స్



నిజంగా కిరణజన్య సంయోగ సామర్థ్యాలను కలిగివున్నాయని నిర్ధారించుకోవడానికి మరింత పరిశోధన అవసరం. అయితే, కెరోటినాయిడ్లు కాంతిని గ్రహించి ఆ శక్తిని అఫిడ్స్‌కు పంపగలవని స్పష్టంగా తెలుస్తుంది.

5) మచ్చల సాలమండర్ (ambystoma maculatum) : ఇది తూర్పు యునైటెడ్ స్టేట్స్, కెనడాలో కనిపిస్తుంది. ఇది 15-25 సెం.మీ.పొడవు ఉంటుంది. పసుపు-నారింజ రంగు మచ్చల రెండు అసమాన వరుసలు తల పైభాగం నుండి (కళ్ల దగ్గర) తోక కొన వరకు ఉంటాయి. ప్రముఖ పరిశోధకుడు ర్యాన్ కర్నీ వీటి పిండాలను అధ్యయనం చేస్తున్నప్పుడు, వాటి కణాల లోపల నుండి ప్రకాశవంతమైన ఆకుపచ్చ రంగును కనుగొన్నాడు.

క్లోరోప్లాస్ట్‌లు కణాలలో మైటోకాండ్రియా సమీపంలో కనుగొనబడ్డాయి. అంటే మైటోకాండ్రియా కిరణజన్య



సంయోగక్రియ ద్వారా సృష్టించబడిన ఆక్సిజన్, కార్బోహైడ్రేట్‌లను నేరుగా వినియోగిస్తుంది. ఇది మచ్చల సాలమండర్‌ను కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యాన్ని కలిగివున్నట్లు కనుగొనబడిన మొదటి సకశేరుకాలుగా రికార్డు సృష్టించాయి.

6) ఓరియంటల్ హార్నెట్ (Vespa orientalis): ఇవి నైరుతి ఆసియా, ఈశాన్య ఆఫ్రికాలో నివసిస్తాయి. ఒక వయోజన హార్నెట్ శరీరం 25, 35 మి.మీ. పొడవు ఉంటుంది. ఇది స్లగ్, మచ్చల సాలమండర్‌లకు భిన్నంగా ఉంటుంది. ఇది దాని



ఎక్సో స్కెలిటన్ క్యూటికల్ సిల్క్ ద్వారా విద్యుత్‌ను ప్రవహించేలా డాక్టర్ జాకబ్ ఇషాయ్ కనుగొన్నారు.

ఆల్గే నుండి క్లోరోప్లాస్ట్‌లను దొంగిలించడానికి విరుద్ధంగా, ఈ కిరణజన్య సంయోగ క్రియ కీటకం పసుపువట్టీలో కాంతిని గ్రహించి విద్యుత్తుగా మార్చే సాంతోఫెరిన్ ఉంటుంది.

శాంతోఫెరిన్ వర్ణద్రవ్యం నిజంగా ఎలక్ట్రిక్‌ను సృష్టించగలదని డా॥ మరియన్ ప్లాట్‌కిన్‌చే అధ్యయనం నిరూపించింది.

గుట్టు విప్పగలిగితే అన్నీ అద్భుతాలే:

ఎలిసియా క్లోరోటికా నత్తలు క్లోరోఫిల్‌ను ఎలా



సంగ్రహించగలుగుతున్నాయి, ఆహారాన్ని ఎలా ఉత్పత్తి చేయగలుగుతున్నాయనేది తేల్చితే ఎన్నో అద్భుత టెక్నాలజీలను రూపొందించవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. సౌరశక్తిని ఉపయోగించి నేరుగా ఆహారం తయారు చేయగల సాంకేతికతను అభివృద్ధి చేయవచ్చని అంటున్నారు. అడవుల నరికివేత తగ్గిపోతుందని, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని, పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొంటున్నారు. చంద్రుడు, ఇతర గ్రహాల పైకి వెళ్లే మనుషులకు ఆహారం సమస్య ఉండదని అంటున్నారు.

మొక్కలు, జంతువుల మధ్య రేఖ అంతగా నిర్వచించబడకపోవచ్చు.

రాబోయే కొన్ని బిలియన్ల సంవత్సరాలలో పరిణామం మనల్ని ఎక్కడికి తీసుకెళుతుందో ఆశ్చర్యానికి గురి చేస్తుంది. బహుశా ఒకరోజు, మానవులు కూడా క్లెప్టోప్లస్టీ ద్వారా ప్రయోజనంగా జీవించగలరేమో అనే ఆశ కలుగుతోంది. మానవుని మేధస్సును తలదన్నే జీవులు ఉద్భవించడం ఖాయంగా కనిపిస్తోంది. ❍



# అరుదైన అనుభవం 'ఇడుక్కు పిళ్ళయార్'

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

తమిళనాడులోని తిరువన్నామలై క్షేత్రాన్ని అపర కైలాసంగా పేర్కొంటారు. సాక్షాత్తు పరమేశ్వరుడు పర్వత రూపంలో కొలువైన దివ్యక్షేత్రం. ఈ పరమ పావన క్షేత్రంలో చేసే గిరి వలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. పరమేష్టికి చేసేదే ఈ ప్రదక్షిణం.

సుఖశాంతులను ప్రసాదిస్తుంది ఈ గిరివలయం. పద్నాలుగు కిలోమీటర్ల గిరి మార్గంలో ఎన్నో పురాతన, పౌరాణిక నేపథ్యం గల ఆలయాలు, నిర్మాణాలు ఉన్నాయి. ప్రతి ఒక్క ఆలయ సందర్శన ఇహపర సుఖాలను అనుగ్రహిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. ఆలయాలు కాకుండా చిత్రంగా నిర్మించిన ఒక నిర్మాణం గిరి ప్రదక్షిణం చేసే వారికి కర్మఫలాన్ని తొలగించేదిగా, మానసిక స్థిరత్వాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగించేదిగా ప్రసిద్ధి పొందింది. అదే "ఇడుక్కు పిళ్ళయార్".



ఇడుక్కు పిళ్ళయార్‌లో చిన్న చిన్న, సన్నని మూడు ద్వారాలు ఉంటాయి. లోపల ఎలాంటి దేవీ దేవతల మూర్తులుండవు. భక్తులు తూర్పు వైపు నుంచి సన్నని ద్వారం గుండా ప్రవేశించి మధ్యలో ఉండే ఇంకా సన్నని ద్వారం దాటి పడమర వైపున ఉన్న మూడో ద్వారం నుండి వెలుపలికి వస్తుంటారు. ముఖ్యంగా మధ్యలో ఉండే ద్వారాన్ని చూస్తే అందులో మనం పట్టగలమా? అందులో నుండి వెలుపలికి రాగలమా? అన్న సందేహాలు కలుగుతాయి.

కానీ పరిశోధకుల అంచనా ప్రకారం ఈ ద్వారాలు మానవ అస్థిపంజరం కొలతల ప్రకారం నిర్మించారని. అంటే మనిషి ఎంత లావుగా వున్నవారైనా సులభంగా బయటికి వస్తారు.

ఇడుక్కు పిళ్ళయార్‌ని తత్త్వవేత్తలు తల్లిగర్భం నుండి శిశువు ఈ ప్రపంచం లోకి వచ్చే మార్గంతో పోలుస్తారు. దీని ప్రకారం ఈ జన్మకు ముందు అనేక జన్మలు ఎత్తిన ఒక జీవి జన్మ జన్మల పాపాలను తొలగిస్తుంది ఈ ఇడుక్కు పిళ్ళయార్ ప్రవేశం. అంతేకాదు.. ఒక జీవిని ఆవరించి ఉండే "నేను" అనే అహం పొరను తొలగించడమే కాకుండా ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం చేస్తుంది.

దీనికి సంబంధించిన ఒక గాథ స్థానికంగా వినిపిస్తుంది.

శ్రీ ఇదయ కట్టార్ సిద్ధార్ , తమిళనాడులో ప్రసిద్ధి చెందిన సిద్ధ పురుషులలో ఒకరు. అనేక సిద్ధ మూలికలతో పళనిలోని శ్రీపళని ఆండవర్(దండాయుధపాణి/కుమారస్వామి) విగ్రహాన్ని తయారు చేసిన ప్రముఖ సిద్ధ వైద్య నిపుణుడు శ్రీ బోగార్ శిష్యుడు ఈయన. గురువు నుండి ఉపదేశం పొంది యోగ, సిద్ధ విద్యలలో ఎన్నో నూతన శిఖరాలను అధిష్ఠించిన ప్రతిభా శాలిగా గురువుచే గుర్తింపు పొందాడు. వీరి కాలం క్రీస్తు పూర్వం అయిదో శతాబ్దంగా పేర్కొంటారు. జీవిత చర మాంకంలో తిరువన్నామలై చేరుకొని అరుణాచలేశ్వరుని సేవించుకొని ఇక్కడే జీవ సమాధి చెందారు. ఆ సమయంలో శ్రీ ఇదయ కట్టార్ సిద్ధార్ ఈ ఇడుక్కు పిళ్ళయార్ రెండు అత్యంత మహిమా న్విత యంత్రాలను ప్రతిష్ఠించారట. ఆ యంత్రాలు లోపలికి ప్రవేశించినవారి మీద పైన చెప్పిన ప్రభావాన్ని చూపుతా యన్నది తరతరాల విశ్వాసం.

మరో రెండు నమ్మకాల గురించి కూడా ఇక్కడ ప్రస్తావించాలి. మొదటిది: తూర్పు నుండి ప్రవేశించి పడమర నుండి వెలు పలికి వస్తే ఇహంలో అన్నింటా జయం, ధన లాభం కలుగుతాయట; అదే పడ మర నుండి ప్రవేశించి తూర్పు వైపు నుండి వెలుపలికి వస్తే ముక్తి లభిస్తుం దట. మూడు సార్లు లోపలికి వెళ్లి వస్తే ఎము కల సంబంధిత రోగాల నుండి ఉపశమ నం కలుగుతుందని అంటారు.

ప్రతి ఒక్కరికీ అనుభవమ య్యేది ఏమిటంటే.. పద్నాలుగు కిలోమీటర్ల గిరి మార్గం లో ఇడుక్కు పిళ్ళయార్ పన్నెండో కిలో మీటరు దగ్గర ఉంటుంది. నడక అల వాటు లేకపోవడం వల్ల కాళ్లనొప్పులు, శరీరం అలసిపోవడం సహజం. ఇడుక్కు పిళ్ళయార్‌లో ప్రవేశించిన తరువాత ఆ బాధల నుండి ఉప శమనం పొందుతారు. కారణం ఏమిటంటే ఇది ఒక ఆటలాగ అనిపించి ఆలోచనలు నడక మీద నుంచి లోపలికి పోవడం గురించి సాగుతాయి.

గిరి వలయం చేస్తున్న భక్తులు ఇక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకొనేందుకు రాతి అరుగులు ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక నిర్మాణం గిరి వలయంలోని 'పంచ ముఖ దర్శనం' దగ్గరలో ఉంటుంది. తిరువన్నా మలై వెళ్లి గిరివాలం చేసే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా 'ఇడుక్కు పిళ్ళయార్' సం దర్శించి అరుదైన అనుభవం సొంతం చేసుకోండి. ❍



సింగిల్ పేజీ కథ


# మా కుక్క

మా ఇంట్లో నేనంటే.. నా భార్య, పిల్లలు, అమ్మా-నాన్నలతో పాటు అందరూ భయపడతారు. ఉదయం నేను లేచి స్నానపానాదులు ముగించుకొని రెడీ అయి ఆఫీసుకు బయలుదేరి వెళ్లిన తరువాతగానీ ఊపిరి పీల్చుకోరు వాళ్లు.

మా ఇంట్లో నాకు ససేమిరా ఇష్టంలేని, తతిమ్మా వాళ్లందరికీ అతి ప్రియమైన పెంపుడు కుక్క ఒకటి వుంది. అది మా ఇంటికి కాపలా కాయటమే కాక అందరిపైన పెత్తనం చెలాయిస్తుంది. అంటే ఇల్లంతా తిరుగుతుంది. అందరిపై ప్రేమను కనబరుస్తుంది. పిల్లలతో ఆడుకుంటుంది. అమ్మచుట్టూ తిరుగుతుంది. నాన్న వాకింగ్‌కు వెళితే ఆయనతో పాటు వెళుతుంది. కానీ నన్ను చూస్తే చాలు భయంతో తోక ముడుచుకొని తప్పించుకొని అతి జాగ్రత్తగా నాన్న వద్దకో, అమ్మవద్దకో వెళ్లిపోతుంది.

అందరితో ప్రియపాత్రంగా వుండే ఆ కుక్కను నేను అస్సలు పట్టించుకోను. ఒకవేళ అది నా కంట పడిందంటే నాకు కోపం వచ్చి దాన్ని కొట్టాలనిపిస్తుంది. అంతేకాదు, మా ఇంట్లో వున్నవాళ్లు ఆ కుక్కకు సేవలు చేయటం కూడా నేను సహించలేను. అందుకే దాన్ని వదిలించుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలుడనయ్యాను. అయినా నా ప్రయత్నాలు మానుకోలేదు. సందర్భం దొరికితే ఇప్పుడైనా సరే తరిమేయాలనుకొంటున్నాను.

ఆ రోజు ఆదివారం. నాకు సెలవు రోజు. అదనుకోసం ఎదురుచూస్తున్న నాకు సందర్భం దొరికిందనుకొని ఆ కుక్కకు ఇవాల్టితో మా ఇంటికున్న బంధాన్ని తెంచిపారేయాలనుకొని పథకం పన్నాను. తొమ్మిది గంటలకన్నా టిఫిన్ తిని సోఫాలో కూర్చొన్నాను. ఎవ్వరూ లేని సమయం చూసి అక్కడే తచ్చాడుతున్న కుక్కను మెల్లగా 'జిమ్మీ' అని పిలిచాను. అది అటూ ఇటూ చూసి భయపడుతూనే నా వద్దకు వచ్చింది.



నేను ప్రేమను నటిస్తూ దాని వొళ్లు నిమిరాను. అది నన్ను నమ్మిందేమో పాపం.. తోకాడిస్తూ తన రెండు కాళ్లను నాపై మోపి నాలుకతో నా చేతులను నాకసాగింది. అంతే! ఎవ్వరికీ తెలియకుండా దాన్ని మెల్లగా తీసుకొని వెళ్లి కారు డోరు తెరిచి లోపల డ్రైవరు పక్కసీట్లో కూర్చోబెట్టాను. అది కిటికీలో నుంచి బయటికి చూస్తూ వుంది. నేను డ్రైవ్ చేసుకొంటూ దాదాపు నాలుగు కిలోమీటర్లకు ఆవల వున్న హైవే మీద కారాపి దాన్ని కిందకు దించి మాయపుచ్చి అక్కడే వదిలిపెట్టి, కారు స్టార్టు చేసుకొని తిరిగి చూడకుండా ఇంటిముఖం పట్టాను. దారిలో ఓ మిత్రుడు కనబడి కారాపి "కాఫీ తాగివెళుదువు రారా' అంటూ నన్ను వాళ్లింటికి తీసుకువెళ్లాడు. అయిదు నిమిషాల్లో కాఫీతో వచ్చింది వాడి శ్రీమతి. కాఫీ తాగి కాసేపు కబుర్లు చెప్పుకొంటుండగా భోజనాల వేళైంది. వాడికి బై చెప్పి ఇంటికి బయలుదేరాను. కారు డ్రైవ్ చేస్తుండగా మళ్లీ నాకు హైవే మీద మాయపుచ్చి విడిచిపెట్టి వచ్చిన ఆ కుక్క గుర్తుకు వచ్చింది. అప్పుడు నేనేదో తప్పు చేసిన వాడిలా ఫీలయ్యాను. నా మనసెందుకో పరి పరివిధాలుగా ఆలోచింపసాగింది. అయినా మనసును అదుపులో పెట్టుకొని డ్రైవ్ చేసాను.

కారు దిగి ఇంట్లోకి చూసాను. అందాక ఎత్తిన మోర దించకుండా నా కోసమే రోడ్డువేపు ఎదురు చూస్తుందేమో అన్న చందాన నేను తీసుకువెళ్లి నాలుగు కిలోమీటర్లకావల హైవే మీద వదిలిపెట్టి వచ్చిన ఆ కుక్క మా వరండాలో నుంచి పరిగెత్తుకొంటూ నా వద్దకొచ్చి నా చుట్టూ తిరుగుతూ వుంది.

షాక్ తిన్నాన్నేను. అప్పుడు నాకు తెలియకుండానే నా కళ్లు చెమర్చాయి. దాన్ని వదిలించుకోవాలని గుట్టుగా అంత దూరం తీసుకువెళ్లి హైవే దగ్గర వదిలిపెట్టి వచ్చినా అంత చక్కగా తిరిగి ఇంటికొచ్చింది ఆ కుక్క. ఇదేనేమో కుక్క విశ్వాసమంటే! అని అనుకొంటుండగా మా నాన్నా భోంచేసి బయటికొచ్చి నన్ను, ఆయనకు ప్రియమైన ఆ కుక్కను ఒక్కటిగ ఆచూశాడు.

ఆయన ముఖంలో ఎక్కడలేని ఆనందం. వెంటనే "ఒరేయ్ చంద్రం! నీకోసమేనేమో ఆ కుక్క దాని కంచంలో పెట్టిన అన్నం కూడా తినకుండా గంటసేపటి నుంచి వసారాలో పచార్లు చేస్తూ నిమిష నిమిషానికి రోడ్డు వేపు చూస్తూ వుంది. నేను బతిమాలినా అది అన్నం తినలేదు. దాన్ని అన్నం తినమని నువ్వయినా చెప్పరా" అంటూ కండువాను భుజానా వేసుకొని బజారుకు వెళ్లిపోయాడు.

మళ్లీ నేను ఆ కుక్కను చూసాను. అది ఆబగా నా వేపు చూస్తోంది. నా కోసం అది అన్నం తినకుండా ఆకలితో వేచి వుందంటే తన మీద, మా కుటుంబం మీద దానికి ఎంత విశ్వాసమో! దాని విశ్వాసం ముందు నిజంగా నేను ఓడిపోయాను. ఆ కుక్క.. కాదు మా కుక్క నా కోసం అన్నం తినకుండా నా కోసం ఎదురు చూస్తూ వుందన్న నాన్న మాటలు మళ్లీ గుర్తుకొచ్చాయి. అప్పుడా మాటల్ని గట్టిగా నమ్మాను. వెంటనే కిందకు వొంగి దాని తలను నిమిరాను. అది ఆనందంతో తన రెండు కాళ్లతో నా గుండెను తాకింది.

"సారీ! ఇంతసేపు నువ్వు భోంచేయకుండా నా కోసం ఎదురుచూస్తూ వున్నావంటే నా మీద నీకెంత ప్రేమో! నిజంగా నేనైతే ఇందాకటి వరకూ నువ్వు క్షణం క్షణం గుర్తుకు వస్తున్నా నిన్ను వదిలించుకున్నానన్న భావనతోనే వున్నాను. అయితే నువ్వు మా కుటుంబంతో బంధం తెంచుకోలేక విశ్వాసంతో తిరిగి వచ్చావు. రావటమే కాదు భోజనం చేయకుండా నా కోసమే ఎదురు చూస్తూ వున్నావంటే నువ్వూ మంచి మనసున్న గొప్పదానవు. అవును.. నీకు మాతోనే నిజమైన బంధముందని నమ్ముతున్నాను. నిజానికి నిన్ను పోగొట్టుకొని వుంటే అందరం నీ దిగులుతో సగమయ్యేవాళ్లమేమో! ఒకే.. నేనొచ్చానుగా జిమ్మీ! రా! భోంచేద్దాం" అన్నాను.

అది వెంటనే తోకాడించుకుంటూ తన కంచం వద్దకు వెళ్లింది.

నేను డైనింగ్ టేబుల్ వద్దకు నడిచాను.

**- బొందల నాగేశ్వర రావు**

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458



# ఇంటి నిర్మాణానికి ఎలాంటి స్థలం తీసుకోవాలి?

**ఇల్లు నిర్మించుకోవడానికి స్థలాన్ని కొనేముందు అనుభవజ్ఞులైన వాస్తుశాస్త్రజ్ఞులను సంప్రదించటం ముఖ్యం. చవకగా దొరికిందనో, డబ్బు ఎక్కువ ఖర్చుయిపోతుందనో అన్న ఆలోచనతో తొందరపడి స్థలం కొని, తర్వాత విచారించటం కంటే 'ముందుజాగ్రత్త' విలువైన కాలాన్ని, ధనాన్ని ఆదా చేస్తుందని గమనించండి.**

మీకు ముందు ఒక స్థలం వుంటే- దానికి తూర్పునగానీ, ఉత్తరాన గానీ ఉన్న స్థలాన్ని కొనవచ్చు. దక్షిణ, పడమర వైపుల్లో వున్న స్థలాన్ని కొనకూడదు. ఈశాన్యంలో వున్న స్థలం అమ్మకానికి వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదు.

కొంచెం శ్రమ పడితే..

ఇల్లు కట్టడానికి స్థల నిర్ణయం చేయటంలో, నిర్ణయించిన స్థలాన్ని వాస్తుబలాన్ని పెంచుకునేలా తీర్చిదిద్దుకోవటంలో కాస్త శ్రమ పడితే ఆ స్థలం యజమానికి కనక వర్షం కురిపిస్తుందనడంలో సందేహం లేదు.

కొత్తగా కొనుక్కునే స్థలం చతురస్రాకారంగా గానీ, సమ భుజ దీర్ఘ చతురస్రంగా గానీ ఉండాలి.

నాలుగు మూలల్లో తొంభై డిగ్రీల కోణాలు కలిగి వుండాలి.

ఎంత ఎక్కువ విశాలమయిన స్థలాన్ని కొనుక్కుంటే అంత మంచిది.

స్థలంలో తూర్పు, ఉత్తరాలకు పల్లం ఉండాలి. అంటే తూర్పుకు, ఉత్తరానికి ఒకే స్థలంలో సహజసిద్ధంగా పల్లాలు ఉండాలని కాదు. ఒకే స్థలంలో తూర్పుకుగానీ ఉత్తరానికిగానీ సహజసిద్ధమైన పల్లం ఉండాలి. రెండో వైపు పల్లం చేయటం కష్టం కాదు. అలాంటి స్థలం దరిద్ర్యాన్ని చేరనీయదు. గొప్ప ఐశ్వర్యాన్ని అందిస్తుంది.

స్థలంలో దక్షిణ, పడమర దిక్కులందు సహజసిద్ధమైన ఎత్తులు వుండాలి. అంటే ఏదో ఒక దిక్కు అని కాదు. రెండు వైపులా ఉండాలి. ఇల్లు ఉచ్చంలో అమరుతుంది. అటువంటి స్థలంలో ఇల్లు కట్టుకుని వుండేవాళ్లకు అసాధ్యాలు సుసాధ్యాలు అవుతాయి. ఎంత గొప్ప ఛాలెంజ్‌నయినా మంచినీళ్ల ప్రాయంగా ఎదుర్కొంటారు.

ఎన్నుకున్న స్థలం దిక్సూచి చూపించే దిక్కులకు సరిగ్గా వుండాలి. అంటే దిక్సూచిలో చూపించే నాలుగు దిక్కులు స్థలంలో వున్న నాలుగు భుజాలను నేరుగా సూచించాలి. అటువంటప్పుడు అందులో మనం నిర్మించబోయే ఇల్లు సరైన పద్ధతిలో అమరుతుంది.



ఒకవేళ నాలుగు దిక్కులు ఆ స్థలంలోని మూలలకు వస్తే ఆ స్థలం అనుకూలించదు. కనుక అలాంటి స్థలాలను కొనకపోవడం ఉత్తమం. అందులో కట్టబోయే గృహం కూడా సరైన వాస్తు పద్ధతిలో అమరదు కాబట్టి లేని దోషాలు వచ్చే అవకాశం ఉంటుంది. అటువంటి మూలలున్న స్థలాన్ని 'అయిమూలలు' వున్న స్థలం అంటారు. పూర్తిగా నాలుగు దిక్కులను కచ్చితంగా చూపించే స్థలాలు దొరకటం అదృష్టం. అలాంటి స్థలాలు ఒక్కోసారి దొరక్కపోవచ్చు. దాదాపు 15 డిగ్రీల తేడా వున్నంత వరకు ఫరవాలేదు.

అలాంటి స్థలాలను కూడా కొనవచ్చు. కానీ ఇల్లు కట్టేటప్పుడు 'స్థలాన్ని' అనుసరించి కట్టాలిగానీ దిక్సూచిని అనుసరించి కట్టకూడదు. అలా దిక్సూచిని అనుసరించి కట్టిన ఇంటికి 'దిక్మూఢం' ఏర్పడి దుష్ఫలితాలు కలుగుతాయి.

స్థలానికి పరిసరాల్లో ఉండే నైసర్గిక స్వరూపం కూడా గమనించాలి. వాస్తుకు అనుగుణంగా మనం మార్పు చేసుకోలేని విధంగా నైసర్గిక స్వరూపం ఆ స్థలానికి వుంటే అలాంటి స్థలాలు కొనటం మంచిది కాదు.

ఉదాహరణకు..

కొనాలనుకున్న స్థలానికి తూర్పునగానీ, ఉత్తరానికి గానీ ఎత్తయిన మట్టిదిబ్బలు, కొండలు వుంటే వాటిని తీసేయటం మన చేతిలో లేని పని.

అలాగే దక్షిణానగానీ, పడమరలో గానీ చెరువులు, పెద్ద పెద్ద గోతులు వుంటే వాటిని పూడ్చలేం.

నైసర్గిక స్వరూపం మనకు అనుగుణంగా అంటే తూర్పు, ఉత్తరాల్లో గోతులు, చెరువులు వుండి; దక్షిణ, పడమరల్లో మట్టిదిబ్బలు, కొండలు వుంటే మరీ మంచిది. ❑



## "మాకొద్దీ తెల్లదొరతనం'

# 'గరిమెళ్ల' స్వాతంత్ర్య పోరాట గీతిక

**భారత** స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో తెలుగు కవులు, రచయితలు పద్యం, పాట, నాటకం, నవల, కథ వివిధ సాహితీ ప్రక్రియలలో జాతిని ఉత్తేజితం చేసే రచనలతో బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించి కారాగారవాస శిక్షలు, నిర్బంధాలు, నిషేధ ఆజ్ఞలు నిరంకుశ అణచివేతలను అనుభవించారు.

1920 నాటికి ఆంధ్రదేశంలోని పద్యకవులను గాంధీజీ ప్రబోధించిన సత్యం, అహింస, శాంతి నిర్మాణాత్మక భావజాలం స్వరాజ్య సాధనోత్తేజానికి నడుం బిగింపచేసింది.

మంగిపూడి వెంకటశర్మ, బసవరాజు అప్పారావు, దామరాజు పుండరీకాక్షుడు, సుంకర సత్యనారాయణ, గురజాడ రాఘవ శర్మ, రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, త్రిపురనేని రామస్వామి చౌదరి, కొండపల్లి జగన్నాథదాసు, వానమామలై వరదాచార్యులు, గరిమెళ్ల సత్యనారాయణ, మల్లాది రామచంద్రశాస్త్రి, శంకరంబాడి సుందరాచార్య, దాశరథి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, మద్దూరి అన్నపూర్ణయ్య, రామచంద్రుని వెంకటప్ప, ఉన్నవ లక్ష్మీనారాయణ ఎందరో అజ్ఞాత రచయితలు, కవులు తొలుత మాతృదేశాభిమానం క్రమేపీ స్వరాజ్య సాధనా లక్ష్యంతో సాహిత్యాన్ని చైతన్యవంతంగా సృష్టించారు. 1920లో గాంధీజీ అహింసాయుత సహాయ నిరాకరణోద్యమానికి పిలుపు యిచ్చారు. వాడుక భాషలో 'శారదా నికేతనం', 'మాలపల్లి' వంటి దేశభక్తి ప్రపూరితమైన శాంతియుత తిరుగుబాటుకు ఉన్నవ లక్ష్మీనారాయణ శ్రీకారం చుట్టారు. నాడు నిషిద్ధ సాహిత్యం అంతా నేడు అపురూప కావ్యాలుగా శతాబ్ద క్రితం నాటి సామాజిక, సాహిత్య పరిణామాలను ప్రతిబింబింపచేస్తోంది.

తెలుగులో జాతీయోద్యమ స్ఫూర్తితో దేశాభిమాని వంటి దిన పత్రికలు, 1902 నాటికే మచిలీపట్నంలో కొండా వెంకటప్పయ్య నెలకొల్పిన కృష్ణాపత్రిక, ముట్నూరు కృష్ణారావు సంపాదకునిగా చరిత్ర సృష్టించింది. 1920 నుండి 1940 రెండు దశాబ్దాలలో, స్వాతంత్ర్యం వచ్చేంతవరకు తెలుగు పత్రికలు, దేశభక్తి, త్యాగనిరతి, స్వేచ్ఛాయుతంగా స్వాతంత్ర్య సాధనకు అంకితమయ్యాయి. స్వాతంత్ర్య పోరాటంలో కలం ఆయుధంగా బ్రిటిష్ నిరంకుశత్వాన్ని ఎదిరించి కఠిన కారాగారవాస శిక్షలు, లాఠీదెబ్బలు, తుపాకి కాల్పులను సైతం సాహసంతో ఎదుర్కొన్న ఆంధ్రకేసరి ప్రకాశం, ఖాసా సుబ్బారావు వంటి త్యాగధనులు ఎందరో పత్రికా సంపాదకులుగా సేవలందించారు. నాటి స్వాతంత్ర్య సమర యోధులకు




కరదీపికలుగా పత్రికలు బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిలదీసేవి. తెలుగు భాషా వికాసానికి, సామాన్య జనావళికి స్వాతంత్ర్యోత్తేజం రగిలించడానికి తెలుగు పత్రికలు ఎనలేని సేవలందించాయి.

దామరాజు వారి నాటక సాహిత్యం నాటి జన సామాన్యంలో స్వాతంత్రేచ్ఛ రగిలించడానికి దామరాజు పుండరీకాక్షుడు నాటక ప్రక్రియ ఆయుధంగా చేపట్టారు. గుంటూరులో స్వరాజ్య సోపాన నిలయం స్థాపించి గాంధీ విజయం అనే స్వరాజ్య సోపానం, గాంధీ మహోదయంగా 1935లో కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పడే వరకు వివిధ స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను నాటకాలుగా ప్రదర్శించేవారు. నాటి జాతినేతలు 24 మంది పాత్రలుగా సృష్టించి బళ్ళారి నుంచి విశాఖపట్నం వరకు బ్రిటిష్ పోలీసుల కళ్లు కప్పి ఉదమ్య పోరాట ప్రచారం నిర్వర్తించే వారు. ప్రభుత్వం నిషేధాజ్ఞలతో వేలాది నాటక ప్రతులు తగులపెట్టించింది. లాఠీ చార్జీలు, జైలు శిక్షలతో ప్రచారానికి విఘాతం కలిగించేది.

'మాకొద్దీ తెల్లదొరతనం' పాట రచయిత జాతీయ కవిగా గరిమెళ్ల సత్యనారాయణ తెలుగు జాతిని ఉర్రూతలూగించారు. 160 లైన్ల ఈ దేశభక్తి గేయం, యితర స్వరాజ్య గీతికలు బ్రిటిష్ ప్రభుత్వ విరోధిగా, గరిమెళ్లను జైలు నిర్బంధాలకు గురి చేసాయి. సుమారు అయిదు వేల ప్రతులు ప్రభుత్వం తగులపెట్టింది. 'శ్రీ సమేత భరతమాత శ్రిత సజ్జన పారిజాత' అద్భుత సమర రాగమాలిక సృష్టించిన గరిమెళ్ల, విదేశీ ప్రభుత్వానికి తాను శత్రువునని ప్రకటించుకొని, జీవితాంతం దారుణ వ్యథ, కష్టాలనుభవించారు. న్యాయస్థాన వాంగ్మూలంలో గరిమెళ్ల "నా గ్రంథాలను తగులపెట్టడం వలన కలిగే మంటలు, చందోబద్ధమైన నా గానాన్ని వాయు మండలానికి వ్యాపింపచేస్తాయి. నా జాతీయ గీత రాగవల్లులు దేశభక్తులకు వీనులవిందుగా వుంటూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని దహింపచేస్తాయి" అన్నారు.

బ్రిటిష్ ప్రభుత్వానికి సత్యం, ధర్మం రాజద్రోహంగా కనిపిస్తోందని హెచ్చరించారు. స్వాతంత్ర్యానంతరం జాతీయ పతాక నిర్మాత కొల్లా వెంకయ్య, జాతీయ గేయకవి గరిమెళ్ల వంటి నిష్కల్మష దేశభక్తులు ఎందరో ఆర్థిక దైన్యంతో నిరుపేదలుగా తనువులు చాలించటం తెలుగుజాతి దౌర్భాగ్యం.

1929 మే నెలలో రాజమండ్రి సమీపంలోని సీతానగరం గౌతమీ ఆశ్రమం నుంచి మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో ప్రచురితమయ్యే కాంగ్రెస్ పత్రికలో చిచ్చుల పిడుగు ఏకాంక నాటిక విప్లవ సైనిక యోధుడు మంగళ్ పాండ్యా అమానుష ఉరితీత సంఘటన ఇతివృత్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. నాటి రచయిత రామచంద్రుని వెంకటప్ప అయినా మద్దూరి రాజద్రోహ నేరంపై ఆ నాటికి కారణంగా రెండున్నర యేళ్ల కఠిన జైలు శిక్ష అనుభవించారు. భారతమాత దాస్య విముక్తికి సామాన్య జనావళిని ఉత్తేజపరిచి, బ్రిటిష్ ప్రభుత్వాన్ని మాతృ దేశం నుంచి పారద్రోలే పోరాటంలో తెలుగు సాహిత్యం ప్రభావవంతమైన పాత్ర నిర్వర్తించింది. శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ', 'చిలకమర్తి లక్ష్మీనారసింహా కవి రచన "భారతదేశంబు ఒక పాడి ఆవు" వంటి పద్యాలు, పాటలు తెలుగు సాహిత్యాన్ని, జాతీయ స్థాయి కీర్తిపతాకగా సుప్రతిష్ఠం చేసాయి.

**- జయసూర్య**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



కోర్టు వ్యవహారాలు అనుకూలం. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. వృధా కాలక్షేపం మంచిది కాదు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవడం మంచిది. దంపతుల మధ్య మనస్పర్థలకు అవకాశం. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ ఏర్పడుతుంది. అకారణంగా మానసిక వేదనకు లోనవుతారు. సామాన్య ధన లాభం.



## వృషభం

విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతానాభివృద్ధి ఆనందం కలిగిస్తుంది. సన్నిహితుల సహకారంతో స్వల్పకాలిక వ్యాపారాలు చేస్తారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వానుభవంతో తెలుసుకుంటారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి.

## మిథునం



ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. ఆరోగ్య, ఆహార సలహాలు తూచా తప్పకుండా పాటించండి. కుటుంబంలో స్వల్ప అభిప్రాయ భేదాలకు అవకాశాలున్నాయి. ఎదురు చూస్తున్న శుభ సమాచారం అందుకుంటారు. శత్రువులు మిత్రులవుతారు. వృత్తి విద్యాకోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. దేశాంతర ప్రయాణ సూచన.



## కర్కాటకం

శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. హోల్ సేల్ వ్యాపారులకు లాభాలు అధికం. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. గతంలో ఆగిపోయిన పనులు వారాంతంలో పూర్తి చేస్తారు. గృహ యోగం.

## సింహం



వాక్చాతుర్యంలో ముఖ్యమైన పనులు చక్కబెట్టుకుంటారు. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. స్త్రీలకు శుభ యోగం. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకండి. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది. ఆకస్మిక ప్రయాణం చేయాల్సి వస్తుంది.



## కన్య

ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. అనుకోని సంఘటనలు జరుగుతాయి. సోమరితనం దరిచేరనివ్వకండి. సాహిత్య సభల్లో పాల్గొంటారు. వృత్తి కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తాహతుకు మించిన రుణాలు చేయకపోవడం శ్రేయస్కరం. వివాదాలు సమసిపోతాయి.

## తుల



దేశ సంచారం చేయాలన్న సంకల్పం నెరవేరుతుంది. ఉద్యోగులకు అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. ఫలితాలు కూడా అలాగే ఉంటాయి. ఆరోగ్య సమస్యలుంటాయి. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు లభిస్తాయి. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. మీ చిరకాల వాంఛ నెరవేరుతుంది. కుటుంబంలో చిన్న చిన్న కలతలకు అవకాశం.



## వృశ్చికం

మొండి బకాయిలు వసూలవుతాయి. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుటారు. దీర్ఘకాలిక సమస్యలు మరింత జటిలమవుతాయి. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. వారాంతంలో అన్ని రంగాల్లోని వారికి బాగుంటుంది. స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తారు. ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల జాగ్రత్త.

## ధనుస్సు



శత్రువులు మిత్రులవుతారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృధా ఖర్చులను నియంత్రిస్తారు. పెట్టుబడులు లాభిస్తాయి. స్త్రీలతో మాట్లాడేటప్పుడు ఆచి తూచి వ్యవహరించండి. ఎదురు చూస్తున్న శుభ సమాచారం వారాంతంలో అందుకుంటారు. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. సాహస నిర్ణయాలు తీసుకుంటారు. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభిస్తారు. నూతన గృహ యోగం.



## మకరం

దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. ఆకస్మిక సంఘటనలు జరిగినా మనోధైర్యంతో ఎదుర్కొంటారు. ధర్మ రక్షణకై పాటుపడతారు. మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. విద్యారంగంలో పని చేసేవారికి బాగుంటుంది. చిరు వ్యాపారులకు పోటీ ఏర్పడినా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. వృత్తి వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. చర్చలు వాయిదా.

## కుంభం




ఆరోగ్యం కుదుట పడుతుంది. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. ఆదాయానికి మించిన ఖర్చులు అసహనం కలిగిస్తాయి. అనుకోని అతిథుల రాక ఆనందం కలిగిస్తుంది. తాహతుకు మించిన రుణాలు చేయడం శ్రేయస్కరం కాదు. భూ తగాదాలు తీరుతాయి. బ్యాంకు రుణాలు మంజూరు. డ్రైవింగ్‌లో మెళకువలు తెలుసుకుంటారు.



## మీనం

వృద్ధాశ్రమాలకు ఆర్థిక చేయూతనిస్తారు. స్త్రీలకు శుభ యోగం. శత్రువులు మిత్రులవుతారు. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. ధర్మ రక్షణకై పాటుపడతారు. దీర్ఘకాలిక సమస్యలు మరింత జటిమవుతాయి. క్రయ-విక్రయాలు లాభదాయకం. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. కింది స్థాయి ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు సంయమనం కోల్పోకండి.



## పట్టు మాస్క్

"రాణీ బడాయి చూశావా?"
"ఏమైంది?"
"పెళ్లిలో పట్టు మాస్కు పెట్టుకుని తిరుగుతూ తెగ హడావుడి చేస్తోంది".

## విశ్వాసంతో..

"నువ్వు కుక్కను ఎందుకు పెంచుతున్నావు రాజీ?" అడిగింది కోమలి.
"నేను కొనుక్కొచ్చి పెంచుకుంటున్నాను కదా, ఆ విశ్వాసంతో మా ఆయన ఏ అమ్మాయి వంకయినా చూస్తే గుర్రుమంటుంది, మాట్లాడితే కరుస్తుంది. దాంతో ఆయన వంచిన తల ఎత్తకుండా ఉంటున్నాడనుకో" చెప్పింది రంజని.

## కొత్త శత్రువు

"విరాగినీ, ఎందుకు బాధ పడుతున్నావ్? ఏమైంది?"
"పిల్లలకు స్కూళ్లు లేవు, మగాళ్లకేమో వర్క్ ఫ్రం హోం. ఎటొచ్చీ మనకే చాకిరీ రెట్టింపైంది. కరోనా స్త్రీ జాతికి కొత్త శత్రువే".

## సీక్వెల్

ఇద్దరు నిర్మాతలు మాట్లాడుకుంటున్నారు.
"కరోనా కొత్త వేరియంట్ వచ్చిందట"
"ఓహ్! సీక్వెలా!
కొత్త ఐడియా
కొంత మంది బుర్రలకు బిజినెస్ ఐడియాలు భలే వస్తాయిరా'
"అవునా, ఇప్పుడు మన వాళ్లలో ఎవరికి వచ్చింది?"
"సుబ్బారావుకు... కేవలం మాస్కులు ఉతుక్కోవడానికి వాషింగ్ పౌడర్ రిలీజ్ చేసి బోలెడంత సంపాదించాడు"

**- ప్రతాప వెంకట సుబ్బారాయుడు**

# సరదాగా కాసేపు నవ్వుకోండి

## సంతోషంగా కనిపించారు

లత: లాయర్‌గారూ! నేను విడాకులు తీసుకున్న నానిని మళ్లీ పెళ్లి చేసుకోవచ్చా?
లాయర్: మీ మనసు మారిందా? ఎందువల్ల?
లత: నిన్న ఒక ఫంక్షన్‌లో ఆయన్ని చూసాను. చాలా సంతోషంగా కనిపించారు.

## మోసం

పరాకు పరమేశం: ఒరే కామేశం! నిన్న పార్టీకి వెళ్లావుగా! ఎలా జరిగింది?
కామెడీ కామేశం: చాలా మోసం జరిగిందిరా!



పరాకు పరమేశం: ఏమైందిరా? చెప్పు..
కామెడీ కామేశం: నీలం టై మాత్రం పార్టీకి కట్టుకుని రమ్మన్నారు. వాళ్లు చెప్పినట్టుగానే వెళ్లాను. అక్కడికి వెళ్లాక తెలిసింది మోసం జరిగిందని.
పరాకు పరమేశం: అక్కడ ఏమి జరిగింది?
కామెడీ కామేశం: హు.. టై ఒక్కటే కాదు.. మిగతావాళ్లు ప్యాంటు, షర్టు వేసుకొచ్చారు మరి.

## నేనూ మీ చెల్లితోనే..

నాని: నేను చనిపోతే ఏం చేస్తావు?
విజ్జి: నా చెల్లితో పాటు ఉండిపోతాను. ఒకవేళ నేను ముందు చనిపోతే మీరేమి చేస్తారు?
నాని: నేను కూడా మీ చెల్లితో ఉంటాను.

## తెలియదు



డాక్టర్: ఈమె మీకు ఏమవుతారు?
లిఖిత: మా అత్తగారు డాక్టర్.
డాక్టర్: సరైన సమయానికి తీసుకొచ్చారు. ఐదు నిమిషాలు ఆలస్యమయితే చనిపోయేవారు.
"అయ్యో డాక్టర్! ఆ విషయం నాకు ముందే తెలియదు.

## ఉప్పు, కారం లేకుండా..

పరాకు పరమేశం: డాక్టర్! నాకు కడుపు నొప్పి చాలా ఉంది.
డాక్టర్: ఔనా! పరమేశం డాక్టర్... ఈ మందులు వేసుకోండి. కారం, పులుపు, ఉప్పు మాంసం, వంకాయ వాడకండి.
పరాకు పరమేశం: అలాగే డాక్టర్. అవి వాడకుండా ఉన్న వంట కూడా చెప్పండి మరి.

**- ఈ.ఎస్.మాధవన్**

## జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com



**చిత్రభారతి**

వాశిరాజు ప్రకాశం

# తెలుగు సినిమా రహదారి మారిందా?

**ఎన్ని** చెప్పినా కాదనలేం.. తెలుగు సినిమా రంగం తన పయనాన్ని అకస్మాత్తుగా మార్చుకుంది. ఈ మార్పు వల్ల లాభమా? లేక నష్టమా? ఈ ప్రశ్నకు జవాబు చెప్ప వలసింది ఆయా నిర్మాతలే. ముఖ్యంగా కొత్తగా పరిశ్రమలు అడుగుపెట్టిన జిల్లాల వారి నిర్మాతలకు ఈ పరిశ్రమ అంతా పచ్చగా ఉంటుంది. ఎటు చూసినా పూదోటలే. మామిడిపండ్లు విపరీతంగా విరబూసినట్లు కనబడుతుంటాయి. కానీ ఆ వెంటనే రుతువులు మారుతున్నాయి. చెట్ల ఫలాలు రాలిపోతున్నాయి. ఆకులు గాలికి రెపరెపలాడుతుంటాయి. ఆ దృశ్యం బిక్కు బిక్కుమంటూ ఉంటుంది.

ఈ ఆకస్మిక పరిణామానికి దోషులెవరు? అన్న ప్రశ్నకు ఎవరినీ తప్పు పట్టలేం. ఒకటి మాత్రం నిజం. కాలం తీసే పరుగు ల్లో చిత్తూరు నాగయ్య నుండి అక్కినేని నాగార్జున వరకు అందరూ ఆశాజీవులే, సృజనాత్మక ప్రతిభావంతులే. ప్రేక్షకులు కొత్తదనానికి స్వాగతం పలుకుతారనే సినీ వ్యాకరణ సూత్రం అప్పటికీ ఇప్పటికీ అదే మార్గం. కొత్త దర్శకులు వస్తున్నారు. అలాగే కొత్త కొత్త కళాకారులు వస్తున్నారు. వారి వారికి లభించిన అవకాశాలను, పాత్రలను సద్వినియోగం చేసుకుంటున్నారు. అలాగే కథలు కొత్తగా భూమిలో నుండి జలధారలా పుట్టుకు వస్తున్నాయి. పాటలు పలుకుతున్నాయి, ఆటలు ఆడుతున్నాయి. సినిమాల విడుదలకు ముందే సినిమా సక్సెస్ మీట్‌లు, అందమైన హంగామాలు నగరంలోని వేదికల మీద విహారం చేస్తున్నాయి. కిక్కిరిసిన ఈ సభలను చూసేందుకు అభిమానులు ఎక్కడెక్కడి నుండో పరుగు పరుగున వస్తున్నారు. అలాగే ఆయా చిత్రాల్లోని జోకులు చెప్పి నవ్విస్తున్నారు. అమ్మాయిలు అందమైన బొమ్మాయిలై సభలను ఆ మూడు గంటల పాటు రక్తి కట్టిస్తున్నారు. ఇదంతా ఈనాటి వ్యాపార సరళి మరి తప్పదు కదా!

ఇదంతా జరిగాక యింకా టెలివిజన్లలో ప్రకటనల జోరుగా పడిన మారునాడు సినిమా విడుదలవుతుంది. ఆ తరువాత ఫలితాలు ఎవ్వరూ చెప్పకపోతే విడుదల యిన ప్రతి పది సినిమాలలో ఎనిమిది సినిమాలు రెండు వారాలు తిరక్కుండా తిరిగి వస్తున్నాయి. మళ్లీ కొత్త సినిమాలు రెడీ. డిస్ట్రిబ్యూటర్లు రెడీ. ప్రేక్షకులు తెలివైనవారు కనుక ముందస్తు అంచనాలు, పబ్లిక్ టాక్ బావుంటే వస్తారు. లేకపోతే ఆ డబ్బులు వేరే వేరే వినోదానికి ఖర్చు పెట్టు కుంటారు. సినిమాల తయారీ ఆరు నెలల ముందుగా "ట్రెండ్ మారాలి" అంటూ ఎలుగెత్తి చెప్పే నిర్మాతలు, దర్శకులు నిశ్శబ్ద లోకంలో దాగుడు మూతలు మూతలు ఆడుతున్నారు. కారణం.. ఫ్లాప్ అయిన సినిమాలకు మళ్లీ అప్పులు పుట్టవు కనుక. అయితే ఈ పరిస్థితిలో మార్పు లేదా? అన్న ప్రశ్నకు ఈ సందర్భంలోనే జవాబు చెప్పుకోవలసిన అవసరం వుంది. 75 సంవత్సరాల తెలుగు సినిమా పయనాలు దాదాపు ఐదు వేల సినిమాలు విడుదలవుతుంటే రేపటి భవిష్యత్తు యింకా అంధకారంలోనే వుంటే ఏమిటీ హంగామా? అందుకే ఒక్కసారి గత వైభవాన్ని, ఆనాటి సినిమాల క్రమశిక్షణ గుర్తు చేసుకుందాం. ఏభై సంవత్సరాల చరిత్రను తిరగవేస్తే ఆనాడు విజయవంతమైన సినిమాలు కృషి, శ్రమజీవనం వల్లనే విజయవంతమయ్యాయి. ఉదాహరణకు అలనాటి 'మల్లీశ్వరి' చిత్రం లోని మల్లమ్మ, నాగరాజు అప్పుడు మనకు వినోదం ఇచ్చారు. వారిని మళ్లీ మన వెండి తెర మీద ప్రత్యక్షం చేయలేమా? ఎవరూ వూహించని 'గుండమ్మ కథ' లాంటి చిత్రాన్ని చూసి ఆరంభ దశలో అందరు నవ్వినా వారం తిరిగేసరికి నవ్విన నాపచేనే పండింది. విడుదలయిన ప్రతి కేంద్రంలో వంద రోజులు ఆడిన 'గుండమ్మ కథ' యివ్వాళ్టికీ ఒక క్రేజ్. అలాగే ప్రసిద్ధ నవల 'దేవదాసు' నేటికీ ఒక చక్కని కావ్యంలా నిలిచింది. ఆ తరువాత దశాబ్దంలో విడుదల యిన 'కాలం మారింది', 'తాతామనవడు'





'మేఘసందేశం' వంటి చిత్రాలను ప్రేక్షకులు ఆనందంగా స్వాగతించారు. కానీ యిటీవలి కాలంలో విడుదలయిన చిత్రాలకు యింతటి వైభవం లేకపోలేదన్న వాస్తవం గుర్తు పెట్టుకుని లెక్కలు దిద్దుకోవాలి.


ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా నిర్మాణ వ్యయం బాగా పెరిగింది. కళాకారులు, టెక్నీషియన్లు సైతం కాలాన్ని బట్టి, అవసరాలను బట్టి పారితోషి కాలు బాగా పెంచారు. సినిమా లాభ నష్టాలతో వారికి సంబంధం లేదు. వారి వారి బాధ్యత నిర్వహించి, సినిమా రంగస్థలం నుండి నిష్క్రమించి, తరువాత చిత్రాల కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు అలనాటి చెన్నైలో వేయి వెలుగులు వెలిగిన స్టూడియోలు కమర్షియల్ కాంప్లెక్సుల్లా మారటం కళ్లకు కనబడే సత్యం. ఈ నిజాలన్నీ నేటి నిర్మాతలు ఒక్కసారి అవగాహన చేసుకోవాలి. చేతిలో డబ్బున్నవారంతా సమర్థులయిన నిర్మాతలు కాలేరు. 'సినిమా' అనేది క్రమశిక్షణాయుత మైన ఒక కళా స్వరూపం అన్న మాట మరవకూడదు. ముందు రెడీ చేసుకోవలసింది మంచి కథలు. ఆయా కథలకు సరిపడే కళాకారులను ఎన్నుకోవాలి. కథలు మరిచిపోయి, భాగ్యనగరంలో వైభవోపేతంగా తిరిగే ఆ వైభవం జనానికి వద్దు. తెర మీద కనపడేదే సినిమా. ప్రతి సినిమా విజయం సాధించాలంటే ఆ కథలో మనస్సు వుండాలి. ఆ మనస్సును ఆరాధించే తపస్సు వుండాలి. సమర్థులు, మేధావులైన కళాకారులను ఎంపిక చేసుకున్న తరువాతే సినిమా పూజా కార్యక్రమాలు ఆరంభించాలి.. కర్పూరం వెలిగించాలి.. దీపకాంతులు వెదజల్లాలి. ❑

ఈ కారంగా 'ర్టూన్స్'


రాజా వారికి శత్రురాజు కుమార్తె బాగా నచ్చింది..
యుద్ధం వదిలేసి ఇల్లరికం వెళ్ళిపోయారు మహారాణీ...!!
Zakir...


అమ్మకానికెళ్తే బిల్లు అడుగుతున్నారు...
ఈసారి బిల్లు బుక్కు కొట్టుకు రా మావా..!!
Zakir...


... స్సార్.. ఐదొందలకు జీయెస్టీ ఎంత ?!
500
100
Zakir...



చైనాలోని ఈ గుహలను 'లాంగ్‌మెన్ కేవ్స్' అంటారు. కొండ పొడవునా రెండు వేలకు పైగా గుహలున్నాయి. ఇందులో వుండే శిల్పాలు అలనాటి శిల్పకళకు అద్దం పడతాయి. వివిధ సైజుల్లో వుండే బుద్ధ విగ్రహాలెన్నో ఉన్నాయి. యునెస్కో గుర్తింపు పొందిన ఈ ప్రాంతాన్ని దేశ విదేశాల పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శిస్తుంటారు.



